


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 215 | బుధవారం 28 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం..

- 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ అన్న ప్రధాని మోదీ
- భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై మోదీ ప్రశంసలు
- ప్రపంచ జీడీపీలో 25శాతం వాటా ఉన్న ఈ డీల్‌తో ఇరు పక్షాలకూ భారీ అవకాశాలు
- భారత తయారీ, సేవా రంగాలకు ఈ ఒప్పందం ఊతమిస్తుందని వెల్లడి
- టెక్స్‌టైల్స్, జ్యూవెలరీ, లెదర్ రంగాలకు లబ్ధి చేకూరుతుందని వివరణ

2లో



## ఏపీకి రానున్న రాహుల్ గాంధీ...

- షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్
- ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమైన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమంలో పాల్గొనాలని రాహుల్‌కు ఆహ్వానం
- షర్మిల విజ్ఞప్తికి సానుకూల స్పందన... ఏపీకి వస్తానని రాహుల్ హామీ
- వైఎస్సార్ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి నుంచే ఉద్యమం ప్రారంభం

2లో



## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై
# గవర్నర్‌కు ఫిర్యాదు

- సింగరేణి బొగ్గు కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్
- కుంభకోణాన్ని ఆధారాలతో బయటపెట్టడంతో కాంగ్రెస్‌లో వణుకు ప్రారంభమైందన్న కేటీఆర్
- సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

హైదరాబాద్- సూర్య వాస్తవం

సింగరేణి బొగ్గు కుంభకోణంపై సీబీఐతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసి విజ్ఞప్తి చేశారు. కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు,



- మిగతా 2లో..

## నేటి నుంచి పార్లమెంట్
# బడ్జెట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్?
- కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం
- సభ సజావుగా సాగేందుకు సహకరించాలని ప్రభుత్వం విజ్ఞప్తి
- గవర్నర్ల తీరు, ఉపాధి హామీ, సర్ యూఎస్ఐఆర్, విదేశాంగ విధానాలపై చర్చకు ప్రతిపక్షాల పట్టు
- ఉపాధి హామీ విధ్వంసం, సర్‌పై చర్చించాలి
- రాష్ట్రపతి ప్రసంగంతో ప్రారంభం



న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు (2026-27) ప్రారంభం కానున్నాయి. రెండు విడతల్లో ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు మొదటి దశ సమావేశాలు, మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి. కాగా తొలిరోజు (బుధవారం) ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసే ప్రసంగంతో బడ్జెట్ సెషన్ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 1న ఉదయం 11 గంటలకు లోక్‌సభలో నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెటనున్నారు. కాగా, పార్లమెంట్

- మిగతా 2లో..

## నేడు తాడేపల్లికి వైఎస్ జగన్

- ఉదయం 11.50 గంటలకు బెంగళూరు నుంచి గన్నవరం చేరుకోనున్న జగన్
- రోడ్డు మార్గంలో 12.30 గంటలకు తాడేపల్లి నివాసానికి
- రేపు నియోజకవర్గ నేతలతో సమీక్ష నిర్వహించనున్న జగన్



2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## పనితీరు బాగోకపోతే
# పదవులు ఊడతాయి

- నేతలకు చంద్రబాబు వార్నింగ్
- పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదు.. నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదన్న చంద్రబాబు
- పదవులు పొందిన నేతల పనితీరుపై ప్రతి 3 నెలలకోసారి సమీక్ష
- జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని దిశానిర్దేశం
- అధికారాన్ని నిలబెట్టుకోవడం అందరి బాధ్యత అని నేతలకు సూచన
- గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తీవ్ర విమర్శలు



అమరావతి - సూర్య వాస్తవం

పార్టీ కంటే ఏదీ ముఖ్యం కాదని, ఏ నాయకుడైనా సరే నిర్లక్ష్యం వహించినా, వివాదాలు సృష్టించినా పక్కనబెట్టడానికి వెనుకాడబోనని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. అధికారం వచ్చిందన్న భావనతో ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలని స్పష్టం చేశారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ కమిటీల వర్క్?షాప్?లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో పదవులు పొందిన వారి పనితీరును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తాను. సరిగా పనిచేయకపోతే వారిని తప్పించి, మరొకరికి అవకాశం కల్పిస్తాను. పార్టీలో తీసుకొస్తున్న మార్పులకు

- మిగతా 2లో..



## సమ్మక్క, సారలమ్మ జాతర శుభాకాంక్షలు
### - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ - సూర్య వాస్తవం

ఆత్మగౌరవానికి ప్రతీకలుగా కొలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం ఏ రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణా కుంభమేళాగా పేరొందిన మేడారం మహా జాతరను వైభవంగా జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ మేరకు మంగళవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలతో నాలుగు రోజుల పాటు జరిగే పండుగను

- మిగతా 7లో..

# భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం..

**- 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ అన్న ప్రధాని మోదీ**
**- భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై మోదీ ప్రశంసలు**
**- ప్రపంచ జీడీపీలో 25శాతం వాటా ఉన్న ఈ డీల్‌తో ఇరు పక్షాలకూ భారీ అవకాశాలు**
**- భారత తయారీ, సేవా రంగాలకు ఈ ఒప్పందం ఊతమిస్తుందని వెల్లడి**
**- టెక్స్‌టైల్స్, జ్యూవెలరీ, లెదర్ రంగాలకు లబ్ధి చేకూరుతుందని వివరణ**

న్యూఢిల్లీ- సూర్య వాస్తవం

భారత్, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఫ్టీూ)పై ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది అన్ని ఒప్పందాలకూ తల్లి లాంటిదని (మదర్ ఆఫ్ ఆల్ డీల్స్) అభివర్ణించారు. ఈ ఒప్పందం ఖరారైతే ఇరు ఆర్థిక వ్యవస్థల మధ్య తయారీ, సేవా రంగాలకు భారీ ఊతం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇండియన్ ఎనర్జీ వీక్ సదస్సులో వర్చువల్?గా ప్రసంగించిన ప్రధాని, ఈ ఒప్పందంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోందని తెలిపారు. cభారత్, యూరోపియన్ యూనియన్ మధ్య ఒక చరిత్రాత్మక ఒప్పందం కుదరబోతోంది. ప్రపంచంలోని అనేక దేశాలు దీనిని ఃమదర్ ఆఫ్ ఆల్ డీల్స్ఃగా చర్చిస్తున్నాయి. ఈ డీల్ 140 కోట్ల మంది భారతీయులకు, యూరప్?లోని లక్షలాది ప్రజలకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుందిc అని మోదీ అన్నారు. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారానికి ఈ ఒప్పందం ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో (జీడీపీ) దాదాపు 25 శాతం, ప్రపంచ వాణిజ్యంలో మూడింట ఒక వంతు వాటా ఈ ఒప్పంద పరిధిలోకి వస్తుందని వివరించారు. ఈ డీల్ ద్వారా భారత్?లోని టెక్స్?టైల్స్, జెమ్స్ అండ్ జ్యూవెలరీ, లెదర్ వస్తువుల వంటి రంగాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ ఒప్పందం కేవలం వాణిజ్యానికే కాకుండా ప్రజాస్వామ్యం, చట్టబద్ధ పాలన వంటి ఉమ్మడి విలువల పట్ల నిబద్ధతను కూడా బలపరుస్తుందని మోదీ స్పష్టం చేశారు. భారత్-యూకే వాణిజ్య ఒప్పందానికి ఈ డీల్ అదనపు బలాన్ని ఇస్తుందని ఆయన జోడించారు.

# ఏపీకి రానున్న రాహుల్ గాంధీ...

**- షర్మిల ఆహ్వానానికి గ్రీన్ సిగ్నల్**
**- ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమైన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల**
**- ఉపాధి హామీ పరిరక్షణ ఉద్యమంలో పాల్గొనాలని రాహుల్‌కు ఆహ్వానం**
**- షర్మిల విజ్ఞప్తికి సానుకూల స్పందన... ఏపీకి వస్తానని రాహుల్ హామీ**
**- వైఎస్సార్ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి నుంచే ఉద్యమం ప్రారంభం**

అమరావతి - సూర్య వాస్తవం

ఏపీ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్?సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు షర్మిల తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్?లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్‌ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీతో ఉపాధి హామీ పథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తికానుంది. ఈ నేపథ్యంలో, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్టు షర్మిల వివరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆమె వెల్లడించారు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్సీల బృందం ఈరోజు గవర్నర్?ను కలిసి సింగరేణిలో బొగ్గు కుంభకోణం జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. సింగరేణిలో దోపిడీ అంశంపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చామని, ఆధారాలతో బయట పెట్టినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైందని అన్నారు. కుంభకోణాన్ని బహిర్గతం చేశాక అధికార పార్టీ గుండెల్లో రైళు పరుగెడుతున్నాయని అన్నారు. అందుకే ప్రజల దృష్టిని మరల్చేందుకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు. ఫుట్?బాల్ ఆటకు రూ.10 కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. సీఎం అంటే కోల్ మాఫియా నాయకుడిగా సింగరేణి కార్మికులు భావించే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సింగరేణి టెండర్లలో పారదర్శకత లేదని అన్నారు. సింగరేణి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కీలక వ్యక్తి సృజన్ రెడ్డి ముఖ్యమంత్రికి బావమరిదేనా, కాదా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి కుంభకోణాన్ని అడ్డుకోవాలని గవర్నర్?ను కోరినట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి సోదరులకు ఇదివరకే దోచుకున్నది సరిపోక, హిల్ట్ పాలసీ పేరుతో హైదరాబాద్?లోని పారిశ్రామిక వాడల్లోని రూ.5 లక్షల కోట్ల విలువైన 9,200 ఎకరాల భూములను కొల్లగొట్టే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కుంభకోణం, హిల్ట్ పాలసీ వంటి ప్రజాధనాన్ని కొల్లగొట్టే ప్రయత్నాలను అడ్డుకోవాలని గవర్నర్‌ను కోరామని అన్నారు.

# నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

చరిత్రలోనే తొలిసారి ఆదివారం బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్? వరుసగా తొమ్మిదో సారి బడ్జెట్?ను ప్రవేశపెట్టనున్నారు. అయితే ఫిబ్రవరి 2 నుంచి 4 వరకు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సాగే అవకాశం ఉంది. మరోవైపు ఎన్నికలు ముగిసిన తరువాత వస్తున్న పూర్తి స్థాయి బడ్జెట్? కావడంతో సామాన్యుల నుంచి పారిశ్రామికవేత్తల వరకు అందరూ బడ్జెట్?పై భారీ ఆశలు పెట్టుకున్నారు.

**గవర్నర్ల తీరు, ఉపాధి హామీ, సర్, యూజీసీ నిబంధనలపై చర్చకు ప్రతిపక్షాల పట్టు**

ఈ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ల తీరు, ఉపాధి హామీ చట్టం పునరుద్ధరణ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్), యూజీసీ నూతన మార్గదర్శకాలు, కొత్త విదేశాంగ విధానం, ఇతర అంశాలపై చర్చకు ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ఉపాధి హామీని దెబ్బతీయడం, కార్మిక కోడ్‌లను విధించడం, లక్షలాది మంది ఓటర్లను మినహాయించిన ఓటర్ల జాబితాను తీవ్రంగా సమీక్షించడం, అమెరికా నిరంకుశ జోక్యాలను ప్రశ్నించని బలహీనమైన విదేశాంగ విధానం, కేంద్రం కొనసాగించిన సమాఖ్య వ్యతిరేక విధానాలు, రాష్ట్రాలపై ఆర్థిక ఒత్తిడి, గవర్నర్ల దుర్వినియోగం, ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ప్రభావం, ఆర్థిక వ్యవస్థపై అమెరికా విధించిన 50శాతం సుంకం వంటి అంశాలపై పార్లమెంటులో చర్చ జరగాలని ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

ఈ సందర్భంగా సర్‌పై వివరణాత్మక చర్చకు కాంగ్రెస్, టీఎంసీ, వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఓటు చోరీ, సర్, రైతుల ధాన్యం సేకరణ, ఉపాధి హామీ పునరుద్ధరణ, ఇతర అంశాలపై చర్చించాలని కాంగ్రెస్? పట్టుబట్టింది. కేంద్ర, రాష్ట్ర సంబంధా లపై, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలపై డీఎంకే, టీఎంసీ, వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. అలాగే ఉన్నత విద్యా సంస్థల్లో కుల ఆధారిత వివక్షను పరిష్కరించే లక్ష్యంతో యూజీసీలో తెచ్చిన కొత్త నిబంధనలపై కూడా పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ అమరావతి రాజధాని బిల్లు అంశాలన్నీ లేవనెత్తింది. భారత్? ఉ ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, 16 ఏండ్లలోపు వారికి సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాలని కూడా పలు పార్టీల ఎంపీలు కేంద్రాన్ని కోరారు. అయితే సమావేశాలకు సంబంధించి ప్రభుత్వ వ్యవహారాల ఎజెండాను ఇవ్వకపోవడంపై సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్ ఇతర సభ్యులు అభ్యంతరం తెలిపారు.

**వీబీ జీఆర్ఎఎం జీ చట్టాన్ని వెనక్కి తీసుకోం...: కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు**

ఈ బడ్జెట్? సెషన్?లో చర్చలు ప్రధానంగా ఉండాలని పార్లమెంట్? వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్? రిజిజు అన్నారు. కొత్తగా తెచ్చిన వీబీ-జీ ఆర్ఎఎంజీ చట్టాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అలాగే సర్‌పై వివరణాత్మక చర్చ చేపట్టాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను తోసిపుచ్చారు. చివరి రెండు సభల్లో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించామన్నారు.

**ఉపాధి హామీ, సర్‌పై చర్చించాలి: జాన్ బ్రిట్టాస్**

బడ్జెట్ సమావేశాల ఎజెండాను సభ్యులకు పంపిణీ చేయలేదని సీపీఐ(ఎం) రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టాస్ సహా ప్రతిపక్ష నాయకులు లేవనెత్తారు. రాష్ట్రపతి ప్రసంగం తర్వాత ఎజెండాను పంపిణీ చేస్తామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్? రిజిజు అన్నారు. అదే సమయంలో, ఉపాధి హామీ విధ్వంసం, సర్ ప్రక్రియ అంశాలపై చర్చ జరగ లేదని బ్రిట్టాస్ నిలదీశారు. గత సెషన్‌లో ఈ రెండు అంశాలపై చర్చించారనే కారణంతో ప్రతిపక్షం చేసిన ఈ డిమాండ్‌ను మంత్రి తిరస్కరించారు. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికీ ఈ రెండు అంశాలను ఉభయ సభలలో బలంగా లేవనెత్తాలనే వైఖరితో ఉన్నాయి. కేరళలో మాత్రమే దాదాపు 15 శాతం మంది ఓటర్లు సర్ ప్రక్రియతో మినహాయించబడ్డారని జాన్ బ్రిట్టాస్ అన్నారు. నాలుగు దశాబ్దాలుగా ఓటర్ల జాబితాలో ఉన్న ఆయన కూడా తాను ఓటరు అని ధృవీకరించే పత్రాలను సమర్పించాల్సి వచ్చిందని తెలిపారు.

ఎంపీగా ఉన్న తన పరిస్థితే ఇలా ఉంటే, సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చని అన్నారు. వెనిజులా, ఇరాన్, పాలస్తీనా, గ్రీన్‌ల్యాండ్‌లలో అమెరికా చొరబాట్లను ప్రశ్నించడానికి కేంద్ర ప్రభుత్వం ధైర్యం చేయడం లేదని అన్నారు. అమెరికాకు పూర్తిగా లొంగిపోయే స్థాయికి విదేశాంగ విధానం బలహీనపడిందని, కార్మికుల హక్కులను దోచుకునే లేబర్ కోడ్‌ల అంశంపై ప్రత్యేక చర్చను జరగాలని డిమాండ్? చేశారు. ఉద్యోగ హామీ విధ్వంసం గురించి కూడా చర్చించాలని అన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభలో సభా నాయకుడు జెపి నడ్డా, కేంద్ర పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, పార్లమెంట్ వ్యవహారాల సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్ మురుగన్, జైరాం రమేష్ (కాంగ్రెస్), తిరుచ్చి శివ (డిఎంకె), సాగరిక ఘోష్? (టీఎంసీ), రాంగోపాల్ యాదవ్(ఎస్పీ), సీపీఐ(ఎం) ఎంపీలు అమ్రారామ్, జాన్ బ్రిట్టాస్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీ నివాసంలో కీలక భేటీ జరిగింది.

# పనితీరు బాగోకపోతే పదవులు ఊడతాయి

(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా నేతలు, కార్యకర్తల్లో కూడా మార్పు రావాలి. వచ్చిన అధికారాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందిc అని చంద్రబాబు స్పష్టం చేశారు. పొలిటికల్ గవర్నెన్స్?లో పార్లమెంట్ కమిటీలు కీలకమని, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కూడా పార్లమెంట్ అధ్యక్షులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీలతో కలిసికట్టుగా పనిచేయాలని, 2024 ఎన్నికల్లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే మరో పది ఓట్లు అదనంగా వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వివాదాస్పద ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్?ను రద్దు చేసి మాట నిలబెట్టుకున్నామని తెలిపారు. cప్రజల భూముల పట్టాదారు పాసుపుస్తకాలపై, పొలం సరిహద్దు రాళ్లపై కూడా వాళ్ల ఫొటోలు ముద్రించుకున్నారు. చరిత్రలో ఎప్పుడైనా ఇలా జరిగిందా? ప్రజల ఆస్తుల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. అందుకే ఆ లోపభూయిష్టమైన చట్టాన్ని రద్దు చేశాం. ఏడాదిలోగా మళ్లీ సర్వేలు చేసి, ఎలాంటి సమస్యలు లేని పట్టాదారు పుస్తకాలు అందిస్తాం అని హామీ ఇచ్చారు. అమరావతి విషయంలో గత ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని, ఇప్పుడు మళ్లీ తాము రాజధానికి జీవం పోశామని అన్నారు. అమరావతే ఏకైక రాజధాని అని స్పష్టం చేస్తూనే, అన్ని ప్రాంతాల అభివృద్ధి తమ ధ్యేయమని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని పునరుద్ఘాటించారు. భోగాపురం విమానాశ్రయంలో 500 ఎకరాలు కొట్టేయాలని చూశారని, పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు.

**కార్యకర్తే అధినేత.. వారికి అండగా ఉండాలి**

పార్టీలో కార్యకర్తే అధినేత అని, వారికి న్యాయం జరిగినప్పుడే పార్టీ శాశ్వతంగా ఉంటుందని చంద్రబాబు అన్నారు. గత ఐదేళ్లలో కార్యకర్తలు ఎన్నో కష్టాలు పడ్డారని, పసుపు జెండా కోసం రక్తం చిందించారని గుర్తుచేశారు. cఏ పని జరిగినా కార్యకర్తలకు గుర్తింపు ఉండాలి. నాయకులెవరూ కేడర్‌ను విస్మరించవద్దు. వారితో నిరంతరం అనుసంధానమై ఉండాలిc అని ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. cమనం చేసే పనులు ఎంత ముఖ్యమో, మనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పికొట్టడం కూడా అంతే ముఖ్యం. సోషల్ మీడియాలోనే కాదు, మౌత్ టు మౌత్ పబ్లిసిటీతో ప్రజలకు వాస్తవాలు వివరించాలి,c అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సూపర్ 6 హామీలను సూపర్ హిట్ చేశామని, డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాల భర్తీతో పాటు రోడ్ల మరమ్మతులు వేగవంతం చేశామని వివరించారు. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ కూటమి గెలిచేలా ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలని కోరారు.

# సమ్మక్క, సారలమ్మ జాతర శుభాకాంక్షలు

(మొదటిపేజీ తరువాయి)

వన దేవతల మహోత్సవంగా జరుపుకుంటారనీ, దాదాపు కోటిన్నరకు పైగా భక్తులు తరలి వచ్చే ఈ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేసిందని తెలిపారు. మేడారం ఆలయాన్ని ప్రజా ప్రభుత్వం పునర్నిర్మించిందని గుర్తు చేశారు. రూ.250 కోట్లతో ఆలయ ప్రాకారం విస్తరణ, సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్ద రాజు గద్దెలను విశాలంగా నిర్మించామన్నారు. గిరిజన ఆదివాసీ ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని ఆధునీకరించి, ప్రాంగణానికి నలు దిశలా తోరణాలను నిర్మించామన్నారు. మేడారం తల్లుల స్ఫూర్తితో జరిపిన ప్రజాస్వామ్య పోరాటం ఫలితంగా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని వనదేవతల దీవెనలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా మేడారంలో మంత్రి మండలి సమావేశాలు నిర్వహించామని పేర్కొన్నారు. జనంకోసం ప్రాణాలైనా ఇవ్వాలనే సందేశం ఇచ్చిన మేడారం సమ్మక్క, సారలమ్మ తల్లుల స్ఫూర్తిగా రాష్ట్రాభివృద్ధికి పునరంకితమవుతామన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్?రెడ్డి అమెరికా నుంచి ఫోన్?లో ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, మొక్కులు చెల్లించుకోవాలనీ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా భక్తులు సహకరించాలని కోరారు.

# నేడు తాడేపల్లికి వైఎస్ జగన్

**- ఉదయం 11.50 గంటలకు బెంగళూరు నుంచి గన్నవరం చేరుకోనున్న జగన్**
**- రోడ్డు మార్గంలో 12.30 గంటలకు తాడేపల్లి నివాసానికి**
**- రేపు నియోజకవర్గ నేతలతో సమీక్ష నిర్వహించనున్న జగన్**

అమరావతి- సూర్య వాస్తవం

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈరోజు బెంగళూరు నుంచి తాడేపల్లికి రానున్నారు. నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతం లక్ష్యంగా వారానికి ఒకరోజు నేతలు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించాలని ఇదివరకే నిర్ణయించిన వైఎస్ జగన్ గత బుధవారం ఏలూరు నియోజకవర్గ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలో రేపు బుధవారం కూడా నేతలు, కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఉదయం బెంగళూరు నుంచి విమానంలో బయలుదేరిన వైఎస్ జగన్ 11.50 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 12.50 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి జగన్ చేరుకుంటారు. కాగా, ఈ రోజు సాయంత్రం ముఖ్య నేతలతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# సంపాదకీయం

## అన్ సంగ్ హీరోస్‌కు పట్టం

పద్మ పురస్కారాలు దేశానికి విభిన్న రంగాల్లో తమ వంతు కంట్రిబ్యూషన్ ఇచ్చిన వారికి ఇచ్చేందుకు స్థాపించినవి. ఆ అవార్డుల ద్వారా వచ్చేది .. వారు దేశానికి సేవ చేశారని గుర్తింపు. కానీ దశాబ్దాల పాటు ఈ అవార్డులు సిఫార్సులు బలంగా చేయించుకున్నవారికే వచ్చేవి. అందుకే వాటిపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. కానీ గత కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పద్ధతిని మార్చేసింది. నిజంగా దేశానికి తమ ప్రతిభతో.. సేవతో..కళతో సేవ చేసిన వారికే ఇస్తున్నారు. ఈ సారి కూడా ఆ సంప్రదాయం తప్పలేదు. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పద్మ పురస్కారాల జాబితా, అవార్డుల ఎంపికలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అద్దం పడుతోంది. రాజకీయ సిద్ధాంతాలు, పార్టీ ప్రయోజనాలకు అతీతంగా కేవలం దేశ సేవను, అర్హతను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని పురస్కారాలను అందించడంలో మోదీ ప్రభుత్వం వందకు వంద మార్కులు కొట్టేసింది. కరడుగట్టిన విమర్శకులు సైతం మెచ్చుకునేలా, అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన అసాధారణ వ్యక్తులను వెలికితీసి గౌరవించడం ఒక గొప్ప సంప్రదాయంగా మారింది.గతంలో కాంగ్రెస్ హయాంలో పద్మ పురస్కారాల ఎంపికపై అనేక విమర్శలు ఉండేవి. ప్రధానంగా ఢిల్లీ వర్గాల్లో పట్టున్న వారు, సిఫార్సుల ద్వారా లేదా రాజకీయ పలుకుబడితో ఈ అవార్డులను పొందుతున్నారనే అభిప్రాయం బలంగా ఉండేది. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దరఖాస్తు చేసుకోకపోయినా, ప్రచారానికి దూరంగా ఉంటూ నిశ్శబ్దంగా సమాజ సేవ చేస్తున్న అన్‌సంగ్ హీరోస్ కోసం వెతికి మరీ పద్మ గుర్తింపు ఇస్తున్నారు. ఇది ఒక పారదర్శకమైన, ప్రజాస్వామ్యబద్ధమైన వ్యవస్థకు నిదర్శనం.రాజకీయ వైరుధ్యాలను పక్కన పెట్టి ప్రత్యర్థి పార్టీల నేతలను కూడా వారి సేవలకు గాను సత్కరించడం ద్వారా ప్రధాని మోదీ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. వీఎస్ అచ్యుతానందన్, శిబూ సోరెన్ వంటి నేతల ఎంపికే దీనికి నిదర్శనం. రాజకీయంగా ఎంతటి తీవ్ర విభేదాలు ఉన్నప్పటికీ, ప్రజా జీవితంలో వారు చూపిన ముద్రను ప్రభుత్వం గౌరవించింది. కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన పద్మ పురస్కారాల్లో రాజకీయాలకు అతీతంగా ప్రజా సేవకులను గుర్తించింది. ముఖ్యంగా కమ్యూనిస్టు దిగ్గజం, కేరళ మాజీ ముఖ్యమంత్రి వీఎస్ అచ్యుతానందన్‌ను దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మవిభూషణ్' తో గౌరవించడం చర్చనీయాంశమైంది. బీజేపీ ప్రభుత్వ సిద్ధాంతాలకు, అచ్యుతానందన్ ప్రాతినిధ్యం వహించే వామపక్ష భావజాలానికి మధ్య తీవ్ర వైరుధ్యం ఉన్నప్పటికీ, ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని , ప్రజా పోరాటాలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రకటించారు. ఇదే కోవలో జార్ఖండ్ ముక్తి మోర్చా వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి శిబూ సోరెన్‌కు పద్మభూషణ్ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాకుండా, సమాజంపై ప్రభావం చూపిన నేతల సేవలను పరిగణనలోకి తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. భావజాల విభేదాలు ఉన్నప్పటికీ, విపక్ష నేతలకు వారి స్థాయికి తగిన గుర్తింపు ఇవ్వడం ద్వారా కేంద్రం ఒక సానుకూల సంకేతాన్ని పంపింది.పద్మ అవార్డులను ప్రభుత్వం మూడు కేటగిరీలుగా విభజించింది:పద్మ విభూషణ్: దేశంలో రెండవ అత్యున్నత పౌర పురస్కారం. అసాధారణ, విశిష్ట సేవలకు దీనిని ఇస్తారు.పద్మ భూషణ్: మూడవ అత్యున్నత పురస్కారం. ఉన్నత స్థాయి విశిష్ట సేవలకు గుర్తింపు.పద్మశ్రీ: నాల్గవ అత్యున్నత పురస్కారం. ఏ రంగంలోనైనా ప్రతిభ చాటిన వారికి, ముఖ్యంగా సామాన్యులకు ఇచ్చే గౌరవం.గతంలో ప్రభుత్వమే పేర్లను సూచించేది, కానీ ఇప్పుడు ప్రక్రియ పూర్తిగా మారింది. సామాన్య ప్రజలు కూడా తమకు తెలిసిన అర్హులను నామినేట్ చేయవచ్చు. చివరికి ఎవరికి వారు 'సెల్ఫ్ నామినేషన్' చేసుకునే అవకాశం కూడా ఉంది. ప్రతి ఏటా ప్రధానమంత్రి ఏర్పాటు చేసే ఈ కమిటీ, వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రాష్ట్రపతి ఆమోదానికి పంపిస్తుంది.చాలామంది ఈ అవార్డుతో పాటు డబ్బు వస్తుందని అనుకుంటారు. కానీ, పద్మ అవార్డులతో ఎటువంటి నగదు బహుమతి లేదా నెలవారీ భత్యాలు ఉండవు. వీరికి లభించే మర్యాదలు ఇవే.

సనద్ ు మెడల్: రాష్ట్రపతి సంతకంతో కూడిన ప్రశంసా పత్రం (సనద్), ఒక పతకం ఇస్తారు.ప్రభుత్వ అతిథులు: వీరు ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వీరిని 'స్టేట్ గెస్ట్స్'గా పరిగణించి వసతి, రక్షణ కల్పిస్తాయి.రైల్వే పాస్‌లు: నిబంధనల మేరకు భారతీయ రైల్వేలో ఉచిత ప్రయాణ సౌకర్యం లభిస్తుంది.ముఖ్య వేడుకలు: గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానాలు అందుతాయి.పద్మ అవార్డు అనేది ఒక గుర్తింపు మాత్రమే, అది బిరుదు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 18(1) ప్రకారం.. గ్రహీతలు తమ పేరుకు ముందు లేదా వెనుక అని వాడుకోకూడదు.ప్రస్తుతం ఈ అవార్డుల విధానంలో గొప్ప మార్పు వచ్చింది. ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఉండి నిస్వార్థంగా సేవ చేస్తున్న 'అన్‌సంగ్ హీరోస్' (గుర్తింపు లేని వీరులు) ను వెతికి పట్టుకుని ప్రభుత్వం గౌరవిస్తోంది. ఇది కేవలం ఒక పతకం కాదు, భారత గడ్డపై ఆ వ్యక్తి ముద్రించిన అంకితభావానికి నిదర్శనం.కొన్ని సందర్భాల్లో రాజకీయ వ్యూహాల కోసమే కొంతమందికి అవార్డులు ఇస్తున్నారనే వాదనలు వినిపించినప్పటికీ, ఎంపికైన వారి వ్యక్తిగత అర్హతలను ఎవరూ వేలెత్తి చూపలేని పరిస్థితి ఉంది. కళా, సాహిత్య, సామాజిక , క్రీడా రంగాల్లో నిష్ణాతులైన వారిని ఎంపిక చేయడంలో ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయం. రాజకీయం అనేది ఎన్నికల వరకేనని, దేశ గౌరవం విషయానికి వస్తే అందరూ ఒక్కటేననే భావనను ఈ పురస్కారాల పంపిణీ కలిగిస్తోంది. పద్మ పురస్కారాల ఎంపికలో నెలకొన్న ఈ సానుకూల మార్పు దేశంలో ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య సంప్రదాయానికి పునాది వేస్తోంది. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ, వారు ఏ మూలన ఉన్నా ఏదో ఒక రోజు గుర్తింపు లభిస్తుందనే నమ్మకాన్ని ఈ వ్యవస్థ కల్పిస్తోంది. ఇలాంటి నిష్పాక్షికమైన వ్యవస్థ కొనసాగడం దేశాభివృద్ధికి, సామాజిక చైతన్యానికి ఎంతో అవసరం.

# త్వరలో లోకేష్‌కు పట్టాభిషేకం.?



**విజయవాడ - సూర్య వాస్తవం**

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పట్టాభిషేకానికి ముహూర్తం రెడీ అయిందని పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి గా నారా లోకేశ్ ను వచ్చే ఏడాది చేయాలని అంతా సిద్ధం చేస్తున్నట్లు పార్టీలోనూ జోరుగా చర్చ జరుగుతుంది. ఇప్పటికే ఢిల్లీలోనూ ఈ మేరకు బీజేపీ కేంద్ర పెద్దలతో ఈ విషయం చర్చించినట్లు సోషల్ మీడియాలో పోస్టులు కనపడుతున్నాయి. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ భావినేతగా నారా లోకేశ్ ఇటు క్యాడర్ లోనూ, అటు నేతల్లోనూ ఫిక్సయిపోయారు. అయితే ముఖ్యమంత్రి పదవి చేపట్టే దెప్పుడు అన్న దానిపైనే జరుగుతున్న చర్చలు ఒక కొలిక్కి వచ్చినట్లు చెబుతున్నారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి పదవి అన్న ప్రచారం జరిగినా దానిని కొట్టిపారేస్తూ ముఖ్యమంత్రి పదవి ఇవ్వడమే మంచిదన్న అభిప్రాయంలో నారా కుటుంబం ఉందని తెలిసింది.నారా లోకేశ్ పార్టీపైనా, ప్రభుత్వంపైన ఇప్పటికే పట్టు సంపాదించుకున్నారు. ఆయన విద్య, ఐటీ శాఖల మంత్రిగా ఉన్నప్పటికీ అన్ని శాఖల బాధ్యతను నారా లోకేశ్ పర్యవేక్షిస్తున్నారు. ఇక ఢిల్లీ స్థాయిలో చంద్రబాబు తో సమానంగా పర్యటిస్తూ కేంద్రమంత్రులను, బీజేపీ పెద్దలను తరచూ కలసి వస్తున్నారు. నారా లోకేశ్ ఎప్పటికైనా ఈ పదవి ఇవ్వడం తప్పదు. టీడీపీ క్యాడర్ అభిప్రాయం కూడా అదే. అయితే చంద్రబాబు నాయుడు ఈ టర్మ్ ముఖ్యమంత్రిగా చేసిన తర్వాత వచ్చే ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వస్తే అప్పుడు నారా లోకేశ్ ను ముఖ్యమంత్రిని చేద్దామని భావించినప్పటికీ కొన్ని కారణాలతో వచ్చే ఏడాది.. అంటే సార్వత్రిక ఎన్నికలకు రెండేళ్లకు ముందుగానే ముఖ్యమంత్రిగా నారా లోకేశ్ ను చేయాలని నారా కుటుంబం ఫిక్సయినట్లు వార్తలొస్తున్నాయి.తెలంగాణలో బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పటికీ కేటీఆర్ ముఖ్యమంత్రి కాలేదు. 2023 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయింది. అందుకే ఈసారి నారా లోకేశ్ ను ముందుగానే ముఖ్యమంత్రిని చేసి ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో చంద్రబాబు కూడా ఉన్నారని తెలిసింది. చంద్రబాబు జాతీయ రాజకీయాల్లోకి వెళతారన్న ప్రచారం కూడా గత కొద్ది రోజులుగా జరుగుతుంది. అందుకే మంత్రి వర్గ సమావేశానికి ముందు టీడీపీకి చెందిన మంత్రులతోనూ, పార్లమెంటు సమావేశాలకు ముందు పార్లమెంటు సభ్యులతో నారా లోకేశ్ సమావేశమయి వారికి దిశానిర్దేశం చేయడం కూడా ఆ ఆలోచనల్లో భాగమేనని అంటున్నారు. ముందుగా మంత్రివర్గ విస్తరణ చేయడంతో పాటు జగన్ పాదయాత్ర ప్రారంభం కాకముందే నారా లోకేశ్ ను ముఖ్యమంత్రి పదవి పై కూర్చోబెట్టాలన్న నిర్ణయానికి వచ్చినట్లు బలంగా అమరావతిలోనూ టాక్ వినిపిస్తుంది. మరి ఇది ప్రచారమా? లేక నిజంగా జరుగుతుందా? అన్నది చూడాలంటే మరికొన్ని నెలలు వేచి చూడక తప్పదు.

### గుంభనంగా క్యాడర్

చంద్రబాబు నాయుడు పాలనలో కొన్ని లోపాలు జగన్ తనకు అనుకూలంగా మలచుకునే అవకాశాలున్నాయి. కానీ టీడీపీ నాయకత్వం లోపాలను సరిదిద్దుకునే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. ఎమ్మెల్యేల అవినీతి ఆరోపణలతో పాటు పార్టీ కార్యకర్తలను పట్టించుకోకపోవడం కూడా ఈసారి టీడీపీకి అననుకూలత అని చెప్పాలి. చంద్రబాబు నాయుడు ప్రతి నియోజకవర్గంలో పర్యటనకు వెళ్లినప్పటికీ అక్కడ టీడీపీ నేతలతో సమావేశం అవుతున్నా.. తాను చెప్పదలచుకున్నది చెప్పి వచ్చేస్తున్నారు. అంతే తప్ప వారి బాధలను, కష్టాలను కూడా స్వయంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. తాను చెప్పదలచుకున్న విషయాన్ని మాత్రం చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు.ఇక నారా లోకేశ్ కూడా క్యాడర్ ను పట్టించుకునే తీరిక.. సమయం ఆయనకు లేదు. కార్యకర్తలకు భరోసా ఉంటానని చెప్పిన లోకేశ్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. కనీసం టీడీపీ సోషల్ మీడియాలో కనిపించే నెగిటివ్ ఒపీనియన్‌లను కూడా లోకేశ్‌కు టీం చేర వేసే ప్రయత్నం చేయడం లేదు. దీంతో ఆల్ ఈజ్ వెల్ అన్న ఫీలింగ్‌లో ఉన్నారు. కూటమిలోని మూడు పార్టీలు కలసి ఉంటే జగన్‌ను సులువుగా ఓడించగలమన్న ధైర్యం మాత్రమే తండ్రీకొడుకుల్లో కనపడుతుంది తప్ప.. క్యాడర్ కష్టాలను పట్టించుకోవాలన్న ధ్యాస మాత్రం ఇసుమంతైనా పెట్టడం లేదు. అదేమంటే రాష్ట్రాభివృద్ధి కోసం అంటూ రాగాలు తీస్తున్నారు.దీంతో స్థానిక శాసన సభ్యులు కనీసం టీడీపీ శ్రేణులకు కూడా అందుబాటులో ఉండటం లేదు. స్థానిక నాయకత్వం వారి నుంచి ఏమి ఆశిస్తున్నారో తెలుసుకోవలసిన బాధ్యతను వారిద్దరిలో ఎవరో ఒకరు తీసుకోకపోతే పార్టీకి నష్టం వాటిల్లుతుంది. జగన్మోహన్ రెడ్డికి ఉన్న ఫిక్స్‌డ్ ఓటు బ్యాంక్‌ను కదిలించటం చాలా కష్టం. టీడీపీకి ఉన్న ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవాలి, తటస్థ ఓటర్లను మెప్పించాలి. ప్రస్తుతం ఉన్న తీరులో టీడీపీ శ్రేణులే స్తబ్దుగా ఉన్నారు. చంద్రబాబు, లోకేశ్ లుపాలనలోనే మునిగిపోవటం టీడీపీకి నష్టం చేస్తుందేమో అన్న ఆందోళన టీడీపీని అభిమానించే వారిలో ఉన్నారు. ఏ ఏ వర్గాలు కూటమి ప్రభుత్వం పాలనపై అసంతృప్తిగా ఉన్నారన్న ప్రయత్నం చేయకపోగా.. సూపర్ సిక్స్ అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకోవడం వల్ల నష్టం తప్ప లాభం ఏమీ ఉండదన్నది ఇప్పటికైనా పసుపు పార్టీ నాయకత్వం గుర్తించ గలిగితే కొంత నష్టనివారణ చేపట్టవచ్చు.

# వైసీపీకి ఆల్ ఈజ్ వెల్ కాదా



**విజయవాడ - సూర్య వాస్తవం**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఆ పార్టీ కోలుకునే పరిస్థితి కనిపించడం లేదు. పైకి ఆల్ ఈజ్ వెల్ అన్నట్టు ఉంది. 40శాతం ఓటు బ్యాంకు ఉంది కాబట్టి తామే అధికారంలోకి వచ్చేస్తాం అంటూ ఆ పార్టీ కలలు కంటోంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలతో దూసుకుపోతోంది. కేవలం సహజమైన ప్రభుత్వ వ్యతిరేకత తప్ప.. పతాక స్థాయిలో మాత్రం కనిపించడం లేదు. పాలన రెండేళ్ల పాటు సజావుగా నడిచిపోయింది. ఇటువంటి తరుణంలో తమను గట్టెక్కించేది నేషనల్ మీడియా అని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. గత ఎన్నికలకు ముందు నేషనల్ మీడియా సర్వేల పేరిట వైసీపీకి అనుకూల ఫలితాలు కూడా ఇచ్చింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు విరుద్ధ తీర్పు ఇచ్చారు. అయినా సరే నేషనల్ మీడియా జపం వదలడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమైన మీడియా మద్దతు ఉంది. సొంత మీడియా సాక్షి అనుకూల ప్రచారం చేస్తోంది. కానీ ఆశించిన మైలేజ్ రావడం లేదు. మరోవైపు తెలుగులో ప్రముఖ న్యూస్ ఛానల్ గా ఉన్న రెండు మీడియాలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయి. ఆపై సోషల్ మీడియా సైన్యం కూడా ఉంది. కానీ ఎందుకో పార్టీకి తగిన మైలేజ్ రావడం లేదు. అందుకే ఆ పార్టీ పునరాలోచనలో పడింది. నేషనల్ మీడియా సేవలను వినియోగించుకోవాలని చూస్తోంది. గతంలో ఇండిగో సంక్షోభ సమయంలో ఓ టిడిపి నేత మాట్లాడిన మాటలను పట్టుకొని.. లోకేష్ కు వ్యతిరేకంగా సదరు మీడియా ఛానల్ ప్రచారం చేసింది. తరువాత కూడా తెలుగుదేశం పార్టీకి వ్యతిరేకంగా హడావిడి చేసింది.తాజాగా దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు ఓ నేషనల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన విషయంలో మాట్లాడే క్రమంలో చిన్నపాటి తప్పిదం దొర్లింది. దానిని వెంటనే సవరించుకున్నారు. తప్పును సరిదిద్దుకున్నారు. కానీ సదరు మీడియా ఉద్దేశపూర్వకంగా ఎడిట్ చేసిన చంద్రబాబు వ్యాఖ్యలను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా విడుదల చేసింది. దానిని పట్టుకుని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రెచ్చిపోయింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రచారం చేసింది. ఈ పరిస్థితులన్నింటినీ గమనిస్తే నేషనల్ మీడియాతో వైసిపి ఒప్పందం చేసుకుందాం అనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. గతంలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఓ మీడియాకు ప్రకటనలతో పాటు ప్యాకేజీ రూపంలో భారీగా ముట్టచెప్పారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో సర్వేల రూపంలో సదరు మీడియా వైసిపికి అనుకూల ఫలితాలు ఇచ్చేది. ఇప్పుడు కూడా అటువంటి ప్రయత్నాలు ఏవైనా మొదలయ్యాయా అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్లాన్ చేస్తున్నారా? అనే అనుమానాలు కూడా పెరుగుతున్నాయి. అయితే 2024 ఎన్నికల్లో ఆ ప్రయత్నం వర్కౌట్ కాలేదు. మరి ఇప్పుడు ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి. అసలు అందులో ఎంత వాస్తవం ఉందో కూడా తెలియాలి.

# ఏపీలో రాజ్యసభ రేస్ షురూ...

**అమరావతి- సూర్య వాస్తవం**

ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. ఈ ఏడాది జూన్ తో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. అంతకంటే ముందే వారి స్థానంలో కొత్తవారి ఎన్నిక జరగనుంది. అయితే కూటమికి స్పష్టమైన బలం ఉండడంతో.. ఆ నాలుగు స్థానాలు కూటమి పార్టీలకే దక్కనున్నాయి. వైసిపి కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితం కావడంతో ఆ పార్టీకి ఛాన్స్ లేదు. ఆ పార్టీ పోటీ చేయదు కూడా. ప్రస్తుతం వైసీపీకి ఏడుగురు ఎంపీలు ఉన్నారు రాజ్యసభలో. అయితే ముగ్గురు ఖాళీ కానుండడంతో నలుగురు సభ్యులు మిగలనున్నారు. అయితే కూటమి పార్టీలో మాత్రం చాలా మంది ఆశావహులు ఉన్నారు. ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.ఈ ఏడాది జూన్లో ఏపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన సానా సతీష్, వైసీపీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ నత్వాని పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక అనివార్యం. ఏడాది కిందట సాన సతీష్ టిడిపి తరఫున గెలవడంతో ఆయనకు రెన్యువల్ చేయనున్నారు. అయితే మిగతా మూడు స్థానాల్లో తెలుగుదేశం పార్టీ ఎన్ని స్థానాలను తీసుకుంటుంది? జనసేనకు ఎన్ని? బిజెపికి ఎన్ని? అనేది చర్చ నడుస్తోంది. అయితే మొత్తం నాలుగు ఎంపీ స్థానాల్లో టిడిపికి మూడు, జనసేనకు ఒకటి దక్కే అవకాశం ఉంది. ఎందుకంటే గతంలో జనసేనకు అవకాశం కల్పించలేదు. బిజెపి ఎక్కువ ఎంపీ పదవులను దక్కించుకుంది. అందుకే ఈసారి బిజెపికి ఛాన్స్ లేదని.. జనసేనకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి మూడు పార్లమెంట్ స్థానాలకు గాను.. ఒకటి సానా సతీష్ కు కొనసాగింపు ఉంటుంది. మిగతా రెండు ఎంపీ పదవుల కోసం పార్టీలో విపరీతమైన పోటీ ఉంది. ముఖ్యంగా వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, భాష్యం రామకృష్ణ, గల్లా జయదేవ్, దేవినేని ఉమామహేశ్వరరావు.. ఇలా చాలామంది పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వర్ల రామయ్య గతంలో పార్టీ అధికారంలో లేనప్పుడే ఓడిపోతానని తెలిసి రాజ్యసభకు పోటీ చేశారు. అందుకే తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. మరోవైపు యనమల రామకృష్ణుడు సైతం రాజ్యసభ పదవి పై ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రస్థాయిలో అన్ని రకాల పదవులు అనుభవించారు. అందుకే ఇప్పుడు పెద్దల సభకు వెళ్లాలని ఆయన భావిస్తున్నారు. భాష్యం రామకృష్ణ సైతం ఎంపీగా పోటీ చేయాలని చూశారు. అప్పట్లో అవకాశం దక్కలేదు. రాజ్యసభ ద్వారా ఆ కోరిక తీర్చుకోవాలని చూస్తున్నారు. గల్లా జయదేవ్ అయితే 2024 ఎన్నికలకు ముందు క్రియాశీలక రాజకీయాలకు దూరమయ్యారు. అయినా సరే పార్టీతో అనుబంధం ఎక్కువ. రాజ్యసభ పదవి కోరుకుంటున్నారు. దేవినేని ఉమా మహేశ్వరరావు అయితే పార్టీ కోసం టికెట్ వదులుకున్నారు. తనకు రాజ్యసభ ఇవ్వాలని కోరుతున్నారు.అయితే సాధారణంగా రాజ్యసభ పదవి అంటే కార్పొరేట్ సెక్షన్ తో కూడుకున్నది.



జాతీయస్థాయిలో సంబంధాలు, పెద్ద పెద్ద వ్యవహారాలు చూసేవారికి ఆ పదవి కట్టబెడతారు. అందుకే ఈసారి కొత్త వ్యక్తులకు అవకాశం ఇచ్చే ఛాన్స్ కనిపిస్తోంది. అనూహ్యంగా కొందరు వ్యక్తులు తెరపైకి వచ్చే అవకాశం ఉందని టిడిపి వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. మరి అందులో ఎంత నిజం ఉందో చూడాలి. కానీ ఆశావహులు మాత్రం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

## బాబు గారూ! స్వర్ణాంధ్ర దేవుడెరుగు.. మద్యాంధ్ర, అప్పుల ఆంధ్ర చేయకండి

### - నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** 2047కు ఆంధ్ర ప్రదేశ్ ను స్వర్ణాంధ్ర చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్పడం హాస్యాస్పదం, విడ్డూరం. ప్రజలు కూటమి పార్టీలకు అధికారం ఇచ్చింది కేవలం ఐదు సంవత్సరాలకే, అంటే 2029 వరకే. ఆ లోపల చేసేది చెప్పాలి కానీ 2047 కు స్వర్ణంధ్ర చేస్తామని చెప్పడం హాస్యాస్పదం. ఇప్పుడు ఉన్న వారిలో ఎవరు కూడా అప్పటికి జీవించి ఉండరు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోంది. మండలానికి నాలుగు మద్యం షాపులు,40 బెల్ట్ షాపులు అన్న విధంగా తయారయింది. మద్యం మత్తులో అనేక అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయి. మూడు జోకర్లు ఆరు కళావరులుగా జూదం విస్తరించింది. సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో జూదం వెర్రి తలలు వేసింది.12 -13 సంవత్సరాల పిల్లలు గంజాయికి, డ్రగ్స్ కు అలవాటు పడిపోతున్నారు. స్వర్ణాంధ్ర దేవుడెరుగు.రాష్ట్రం మధ్యాంధ్రగా, జూదాంధ్రగా, డ్రగ్ఆంధ్రగా మారకుంటే చాలు,అదే పది వేలు అని ప్రజలు అనుకుంటున్నారు. కూటమి పాలనలో రాష్ట్రంఅప్పుల కుప్పయింది.కేవలం 18 నెలల కాలంలో 2,66,175 కోట్ల రూపాయల అప్పుచేసి ఆల్ టైం రికార్డు సృష్టించింది.అప్పుల్లో కూటమి ప్రభుత్వానికి ఆస్కార్ అవార్డు ఇవ్వచ్చు. స్వర్ణాంధ్ర దేవుడెరుగు. అప్పుల ఆంధ్ర చేయకుంటే అదే చాలని ప్రజలు అనుకుంటున్నారు.ఇప్పటికైనా ఊకదంపుడు ఉపన్యాసాలు మానుకొని నిర్మాణాత్మక కార్యక్రమాలు చేపట్టాలని తులసి రెడ్డి కూటమి ప్రభుత్వానికి సూచించారు. సూపర్ సిక్స్ హామీలలో ఇంకా అమలుకు నోచుకోని నిరుద్యోగ భృతి,ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం ఈ హామీలను వెంటనే అమలు చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తర్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, చిన్నకోట్ల నాగరాజు, నా మా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## చేతి వృత్తి కార్మికులందరూ ఐక్యంగా ఉండాలి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** చేతి వృత్తి పని చేసే కార్మికులు అందరూ ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకొనేందుకు పోరాటం చేయాలని వేంపల్లె ఎలక్ట్రికల్ ప్రయివేటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ముని కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రయివేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయ ఎలక్ట్రికల్ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అలాగే చేతి వృత్తి కార్మికులకు ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి వృత్తి పనులు చేసే ఎలక్ట్రికల్ కార్మికులకు లేబర్ అధికారులు కార్డులను పంపిణీ చేయాలని కోరారు. అలాగే ఎలక్ట్రికల్ పని చేసే సమయంలో గాయ పడిన కార్మికులకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. పని ముట్లును పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. స్వయం ఉపాధి పనులు చేసుకొనే కార్మికులకు బ్యాంకుల నుండి 90 శాతంతో సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కోరారు. నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు స్వయం ఉపాధి పనులు చేసుకొనే వారికి ఆదుకొనేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రతి ఎడాది జనవరి 27న జాతీయ ఎలక్ట్రికల్ దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లు చెప్పారు. చేతి వృత్తి పనులు చేసుకొనే కార్మికులు అందరూ సమస్యలు తీరాలంటే ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ ఎలక్ట్రికల్ నాయకులైన జిలాన్, అబ్దుల్ హాకీంలను అసోసియేషన్ తరుపున శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె ప్రయివేటు ఎలక్ట్రికల్ అసోసియేషన్ నాయకులు, ఎలక్ట్రికల్ కార్మికులు పాల్గొన్నారు.

## నూతన భవన నిర్మాణానికి కొర్రపాటి బ్రదర్స్ రూ.20 వేల విరాళం



**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని జగనన్న కాలనీ కి వెళ్లే 100 అడుగుల రోడ్ మార్గంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్మిస్తున్న నూతన భవన సముదాయ నిర్మాణం కొరకు పట్టణానికి చెందిన కొర్రపాటి బ్రదర్స్ కిరణ్, నవీన్ లు 20 వేల రూపాయలు విరాళం మొత్తాన్ని వారి నివాసం నందు మంగళవారం సేవాసమితి అధ్యక్షులు రాజు కి అందజేశారు. ఈ సందర్భంగా కొర్రపాటి బ్రదర్స్ కిరణ్, నవీన్ లు మాట్లాడుతూ విద్య, వైద్య, పర్యావరణ విభాగాలతో పాటు కోవిడ్ లాంటి ప్రకృతి విపత్తు లాంటి అన్ని సామాజిక సేవల లోను ఎన్నో సంవత్సరాలు గా స్నేహిత అమృత హస్తం సేవాసమితి వారు నిర్వహిస్తున్న సేవలు మరువలేనివి అని అలాగే భవిష్యత్ లో ఈ సంస్థ నేత్రదానం, యువత, మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమాలతో ఉపాధి మార్గాల దృష్ట్యా అలాగే పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు అలాగే పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణా లాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతి కొరకు భవన సముదాయం ఎంతైనా అవసరం ఉంది. పలు సామాజిక సేవలలో భాగంగా తమ వంతు బాధ్యతగా ఈ విరాళం అందజేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్ లో ఈ సేవాసమితి నిర్వహించే కార్యక్రమాలకు మరింత సహాయ సహకారాలు అందజేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తమ సంస్థ తరపున నిర్మిస్తున్న నూతన భవన సముదాయ నిర్మాణం లో భాగస్వాములైన కొర్రపాటి బ్రదర్స్ అయిన కిరణ్ నవీన్ లు ఇప్పటికే తమవంతు సామాజిక బాధ్యత గా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండటం అభినందనీయం అని స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో సేవాసమితి సభ్యులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత.. ఇచ్చింది గోరంత

- పార్లమెంటు సభ్యులారా పోరాడండి.. సాధించండి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత కాగా ఈ 11 సంవత్సరాలలో ఇచ్చింది గోరంత మాత్రమే అని రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ...ఈ పార్లమెంటు సమావేశాలలో నైనా రాష్ట్రానికి చెందిన లోక్ సభ, రాజ్యసభ సభ్యులు ఈ సమస్యలపై పార్లమెంటులో గళమెత్తి పోరాడి వాటిని సాధించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. నాడు మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు ఐదు సంవత్సరాల పాటు ప్రత్యేక హోదాను అమలు చేస్తామని పార్లమెంటు సాక్షిగా ప్రకటన చేసింది. మన్మోహన్ సింగ్ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం తీర్మానం కూడా చేసింది. దురదృష్టవశత్తు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలు దాటిన ఇంత వరకు అమలు చేయలేదు.

ప్రత్యేక హోదా రాష్ట్రానికి సం జీవని లాంటిది. కేంద్ర పన్నుల్లో రాయితీలు లభి స్తాయి.. దీనివలన పెటుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెడతారు. తద్వారా నిరుద్యోగ సమస్య నిర్మూల నమవుతుంది. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతం నుండి 90 శాతానికి పెరుగుతుంది. విదేశీ ఆర్థిక సంస్థల సహకారంతో రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నూరు శాతం నిధులు భరిస్తుంది.ప్రత్యేక హోదా అమలై ఉంటే ఈపాటికి నవ్యాంధ్ర స్వర్ణాంధ్ర అయి ఉండేది.2047 వరకు వేచి ఉండాల్సిన అవసరం ఉండేది కాదు. కనీసం ఈ పార్లమెంటు సమావేశాలలోనైనా ప్రత్యేక హోదా సాధన కోసం పార్లమెంటు సభ్యులు పోరాడి సాధించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

విభజన చట్టం సెక్షన్ 46 సబ్ సెక్షన్ 3 ప్రకారము కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ గానీ,ఒరిస్సా లోని కె బి కె తరహా ప్యాకేజీ గానీ అమలు చేయాలి.11 ఏళ్లు పూర్తయినా మోడీ ప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయం.ఈ పార్లమెంటు సమా వేశాలలో పార్లమెంటు సభ్యులు ఈ ప్యాకేజీ కోసం పోరాడి సాధించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో సమీకృత ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలి,దుగరాజపట్నం వద్ద మేజర్ ఓడ రేవు నిర్మించాలి,రాష్ట్ర రాజధానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో నిధులు ఇవ్వాలి,పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టును కేంద్ర నిధులతో సత్వరం పూర్తి చేయాలి,విశాఖ మెట్రో,విజయవాడ మెట్రో రైలు మార్గాలను నిర్మించాలి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం విమానాశ్రయాలను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలి,కాకినాడ పెట్రోల్ కెమికల్ కాంప్లెక్స్ ,విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్లను నెలకొల్పాలి. ఇవే మీ అమలు కాలేదు. ఐఐటి, ఎన్ఐటి లాంటి 13 కేంద్రీయ సంస్థలను నవ్యాంధ్రలో ఏర్పాటు చేయాల్సి ఉండగా అవన్నీ నత్త నడకన సాగుతున్నాయి.విభజన చట్టంలో 9,10 షెడ్యూల్ల కింద ఉన్న సంస్థలు రాష్ట్రానికి రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటికీ రాలేదు. ఈ సమస్యలన్నిటిమీద రాష్ట్రానికి చెందిన లోక్ సభ, రాజ్యసభ సభ్యులు నిర్మాణాత్మక వైఖరితో పటిష్టమైన వాదనలు వినిపించి సాధించాలని తులసి రెడ్డి కోరారు.

## బ్యాంకింగ్ వ్యవస్థలో ఐదు రోజుల పని విధానం చాలా ముఖ్యం

- బ్యాంకు ఉద్యోగుల నిరసన




**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందులలోని స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (మెయిన్ బ్రాంచ్) ఎదురుగా మంగళవారం ఎస్బీఐ, ఏపీజీబీ, యూనియన్, కెనరా బ్యాంకుల ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ ఇండియా బ్యాంకింగ్ స్ట్రైక్ 5 డేస్ వర్కింగ్ కావాలని కోరుతూ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ సాధించేవరకు నిరసన తెలుపుతామన్నారు.

ప్రతి పౌరుడికి విశిష్ట సేవలు అందించడంలో బ్యాంకులు ముందు వరుసలో ఉంటాయన్నారు. నిపుణుల అభిప్రాయం మేరకు బ్యాంకింగ్ వ్యవస్థలో ఐదు రోజుల పని విధానం చాలా ముఖ్య మన్నారు. ఈ విధానాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి అంటూ తెలిపారు. ప్రస్తుతం జీవిత బీమా సంస్థ తరహాలో బ్యాంకులకు కూడా ఐదు రోజుల పని విధానం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి మోడీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ స్పందించి తమ డిమాండ్ కు సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. లేనిపక్షంలో తమ డిమాండ్ సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్ ను ప్రభుత్వాలు సానుకూలంగా స్పందిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ పరిధిలోని వివిధ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాబోవు రోజుల్లో కార్యకర్తకు పెద్దపీట

- వచ్చేది మన ప్రభుత్వం అంటున్న మాజీమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి





**డోన్ - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం నియోజకవర్గ క్షేత్ర స్థాయి పార్టీ సంస్థత నిర్మాణ సమావేశం నిర్వహించారు. నూతనంగా ఎర్పాటు ఐనటువంటి కమిటీ సభ్యులు లను ఉద్యశించి ప్రశసంగించటం జరిగింది. ప్రతి ఒక్క కార్యకర్త గతం కంటే దీటుగా రేట్టింపు ఉత్సాహంతో పని చేయాలని ఆకాంక్షిస్తూ కార్యకర్తను ఉద్దేశించి ప్రసంగిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపారు. గతంలో అభివృద్ధి చూసారు రాబోవు రోజుల్లో కార్యకర్తకు ఉన్న స్థాయిలో కూర్చో బెడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నంద్యాల జిల్లా మాజీ జడ్పిటిసి చైర్మన్ పాపి రెడ్డి, డోన్ నియోజకవర్గం అబ్జర్వర్ దేశం సుధాకర్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులు, సానుభూతిపరులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దివ్వెల గోపాల్‌కు శ్రద్ధాంజలి ఘటించిన తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లి వైశ్య వీధికి చెందిన దివ్వెల చెన్నయ్య కుమారుడు దివ్వెల వేణుగోపాల్ అనారోగ్యంతో మంగళ వారం స్వర్గస్తులయ్యారు. రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ న రెడ్డి తులసి రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామా వినయ్ గోపాల్ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన పవిత్ర ఆత్మకు ప్రశాంతిని ప్రసాదించాలని పరమేశ్వరుని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాప సానుభూతిని తెలియజేశారు.

## ఖాకీపై కసి తీర్చుకున్న ఖద్దరు

- నిజాయతీకి బహుమానం..బదిలీ
- 40 రోజులకే బదిలీ అయిన వన్‌టౌన్ సీఐ శ్రీరామ్




**కడప- సూర్య వాస్తవం:** ప్రొద్దుటూరు 1 టోన్ సీఐ శ్రీరామ్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న టీవీ కొండారెడ్డి నియామకం. గత డిసెంబర్ 18న ప్రొద్దుటూరు 1 టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీరామ్.. 40 రోజులకే బదిలీ కావడంపై సర్వత్రా చర్చా. నిజాయితీ ఆఫీసర్‌గా పేరు తెచ్చుకున్న సీఐ శ్రీరామ్. బాధ్యతలు తీసుకున్న నెల రోజుల్లోనే 1 టౌన్ పరిధిలో అసాంఘిక శక్తులను కట్టడి చేసిన సీఐ. ఫలితంగా 40 రోజుల్లోనే బదిలీ అయిన సీఐ శ్రీరామ్ . సీఐ బదిలీపై భగ్గుమంటున్న పట్టణ వాసులు

# విద్యా కుసుమాలు పూయించిన
# ఆంగ్లేయుడు మాల్టస్ స్మిత్

**- శతాబ్ది కాలంగా విద్యా వ్యాప్తి చేస్తున్న సియస్ఐ విద్యా సంస్థలు**







**గుత్తి - సూర్య వాస్తవం :** స్వతంత్రం సిద్ధించి 79 సంవత్సరాలలో ఉన్నత విద్యకు సంబంధించిన ఒక్కటంటే ఒక్క కళాశాల గుత్తి లో ఏర్పాటు కాలేదు. వంద సంవత్సరాల కిందట ఈ ప్రాంతం ప్రపంచానికి విద్య తలమానికంగా ఉండాలని ఎన్నో విద్య సంస్థలను నెలకొల్పారు. గుత్తి అనే చారిత్రక ప్రాముఖ్యత గల ప్రాంతంలో విద్య ద్వారా సమాజోద్ధరణకు తన జీవితాన్ని అంకితం చేసిన అసాధారణ విద్యావేత్త మాల్టాస్ స్మిత్. కేవలం 25 సంవత్సరాల వయస్సులోనే ఆయన ఇంగ్లాండ్?ను విడిచి, 1922లో భారతదేశానికి వచ్చి, ఆంధ్రప్రదేశ్‌లో లండన్ మిషనరీ సొసైటీకి చెందిన మిషనరీ సంస్థల కమిషనర్?గా సేవలందించారు. గుత్తి లండన్ మిషన్ సంస్థల కారస్పాండెంట్‌గా నియమితులైన ఆయన, విద్యారంగంలో చేసిన సేవలు ప్రాంత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, స్థానిక ప్రజల సహకారంతో నిధులను సమీకరించి ఈ సంస్థల నిరంతర నిర్వహణకు మాల్టస్ స్మిత్ కృషి చేశారు. లండన్ నుంచి వచ్చిన విచారణ కమిటీ, ఆయన అంకితభావం, నిజాయితీ, మరియు గ్రామీణ స్థాయి ప్రయత్నాలకు మెచ్చి, సంస్థలను కొనసాగించాలన్న ఆయన ప్రతిపాదనను ఆమోదించింది. ఆయన దూరదృష్టి గల నాయకత్వంలో ఈ సంస్థ రాయలసీమ ప్రాంతంలో ఉన్న కొద్దిమంది అప్?పర్ హై స్కూళ్లలో ఒకటిగా ఎదిగి, పరిసర ప్రాంతాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యాలు కల్పించింది. స్థానిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని, 1930లో వ్యవసాయాన్ని ఐచ్ఛిక విషయంగా ప్రవేశపెట్టడం ఆయన ప్రగతిశీల ఆలోచనకు నిదర్శనం. గుత్తి పట్టణానికే పరిమితం కాకుండా, సమీప గ్రామాల్లో కూడా పాఠశాలలను స్థాపించి, దూర ప్రాంతాలు కరువు ప్రభావిత ప్రాంతాల పిల్లలకు విద్యా వెలుగులు ప్రసరింపజేశారు. 1958లో ఆయన పదవీ విరమణ చేసినప్పుడు, గుత్తి ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయనను ప్రేమగా స్మిత్ దొర మరియు స్మిత్ అయ్యగారు అని పిలుచుకునేవారు. మాల్టస్ స్మిత్ గారి వారసత్వం నేటికీ మాల్టస్ స్మిత్ జూనియర్ కాలేజ్, మాల్టస్ స్మిత్ డిగ్రీ కాలేజ్, మరియు మాల్టస్ స్మిత్ ఎయిడెడ్ హై స్కూల్ రూపంలో కొనసాగుతోంది. ఈ సంస్థలు అన్నీ చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ఆధ్వర్యంలో సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. అంతే కాకుండా, ఆయన భార్య శ్రీమతి మిస్సమ్మ గారి సేవలు కూడా విశేషమైనవే. పాఠశాల మరియు జూనియర్ కాలేజ్ అభివృద్ధిలో ఆమె కీలక పాత్ర పోషించారు. వీరిద్దరూ కలిసి గుత్తి మరియు అనంతపురం పట్టణాలలో అనేక అనుబంధ విద్యాసంస్థలు స్థాపించారు. ఫుట్?బాల్ మైదానాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, వృత్తి శిక్షణా సంస్థలను నెలకొల్పారు. ప్రముఖ విద్యావేత్త దాత మిస్టర్ స్నోప్స్ గారి స్మారకార్థంగా ఒక వృత్తి మరియు హస్తకళల శిక్షణా సంస్థకు పేరు పెట్టడం ద్వారా, ప్రాయోగిక విద్య మరియు స్వావలంబనపై వారి నిబద్ధతను చాటారు. అదేవిధంగా, ఆలిస్ జ్ఞాపకార్థం గుత్తి లో ఒక వాణిజ్య సముదాయాన్ని నిర్మించి, స్థానిక అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించారు. ఈ ప్రాంత చరిత్రలో మరో గొప్ప వ్యక్తి బిషప్ జె. జె. మాస్టర్స్, చివరి బ్రిటిష్ బిషప్. ఆయన ఈ ప్రాంత అభివృద్ధికి అపూర్వమైన సేవలు అందించారు. ఆయన కుమారుడు క్రిస్టోఫర్, కుమార్తె భారతి, విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ, గుత్తి తో తమ అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ప్రతి క్రిస్మస్ సమయంలో గుత్తి ని సందర్శించి, తమకు సేవలందించిన వంటవాళ్లు, క్షౌరులు, ధోబీ, డ్రైవర్లు తదితరులకు సహాయం అందిస్తున్నారు. విశేషంగా, భారతి తన కుమారుడికి "ఇండియా" అనే పేరు పెట్టడం, ఈ దేశంతో వారి గాఢమైన భావోద్వేగ అనుబంధానికి ప్రతీక గా నిలుస్తుంది. ఈ మహానుభావులందరూ కలిసి విద్య, సేవ, మరియు మానవతా విలువలతో కూడిన ఒక శాశ్వత వారసత్వాన్ని గుత్తి ప్రాంతానికి అందించారు. ఈ వారసత్వం నేటికీ గుత్తి యొక్క సామాజిక, సాంస్కృతిక జీవితాన్ని ప్రభావితం చేస్తూనే ఉంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా చర్చస్ ఆఫ్ సౌత్ ఇండియా ఎడ్యుకేషన్ బోర్డు చైర్మన్ డా రస్సెల్ కిరణ్ ఏర్పాటు చేసిన సమావేశంలో అకడమిక్ అడ్వైసర్ ప్రొ ముచ్చుకోట సురేష్ బాబు, మాల్టాస్ స్మిత్ కళాశాల ప్రిన్సిపాల్ సీ బి నీలిమ, డా జోయల్ కిషోర్, అధ్యాపకులు ఇషాక్ బాషా, తదితరులు మాల్టాస్ స్మిత్ సేవలను కొనియాడారు.

## అరటి పొలాలలో కొండచిలువ

**- పాములు ఎక్కడ ఉన్న సమాచారం ఇస్తే వెంటనే వస్తాం**

**- స్నేక్ క్యాచర్ సుదర్శన్ రెడ్డి**



**లింగాల - సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం కామసముద్రంలో అరటి పొలంలో ఉన్న కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్. పట్టుకోవడం జరిగింది. వివరాలలోకి వెళితే కామ సముద్రం గ్రామానికి చెందిన దశరథ రామిరెడ్డి తన అరటి పొలంలో కొండ చిలువను చూసి వెంటనే స్నేక్ క్యాచర్ సుదర్శన్ రెడ్డి కిఫోన్ చేయగా వెంటనే మధుసూదన్ రెడ్డి అక్కడ కు వచ్చి ఆ కొండచిలోను పట్టుకున్నాడు. పాములను, కొండచిలువలను ఎక్కడైనా ఉంటే తనకు సమాచారం అందిస్తే వెంటనే అక్కడకు వచ్చి వాటిని పట్టుకొని వాటిని అడవులలో వదిలి వేస్తానని మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆ పట్టుకున్న కొండ చిలువను మధుసూదన్ రెడ్డి మరియు వాసుదేవ రెడ్డి బ్రహ్మానందరెడ్డి కలిసి నామాల గుండు వద్ద ఫారెస్ట్ లో దానిని వదిలేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో చుట్టుపక్కల ఏ గ్రామంలో అయినా ఇళ్లలో గాని, తోటలలో కానీ, ఇబ్బంది కలిగిస్తుందని తెలిస్తే వెంటనే ఈ నెంబర్‌కు 9866660195 ఫోన్ చేస్తే వెంటనే అక్కడికి వచ్చి ఎలాంటి పామునైనా ,ఎంత పెద్ద పామునైనా, ఏ రకం పాపునైనా, పట్టుకుంటానని ఆయన తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**- సేవా తత్పరుడు డాక్టర్ కోలా**

**- ఉచిత శిబిరాన్ని ప్రారంభించిన వైయస్ మధు**





**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణంలోని సిఎస్ఐ చర్చి గౌడ్‌లో దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి, గుండె, దంత ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సిఎస్ఐ చర్చ్ ట్రెజరర్ వైయస్ మదన్మోహన్ రెడ్డి, సి ఎస్ ఐ చర్చి ఫాదర్ థామస్ బాబులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైయస్ మధు మాట్లాడుతూ డాక్టర్ కోలాప్రసాద్ సేవా తత్పరుడని, ఈయన ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. కంటి, గుండె ,దంత పరీక్షలకు సంబంధించి కులాలకు మతాలకు అతీతంగా 550 మంది పైనప్రజల పాల్గొని వారికి సమస్యలను డాక్టర్లకు వివరించి పరీక్షలుచేయించుకున్నారన్నారు. వ్యాధిని బట్టి డాక్టర్లు మందులు ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. పేద ప్రజల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కోలా ప్రసాద్ మరెన్నో నిర్వ హించాలని ఆయన ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందుగా బిఆర్ అంబేద్కర్, మదర్ తెరిసా చిత్రపటాలకు వారు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వైయస్ మదన్ మోహన్ రెడ్డిని, చర్చి ఫాదర్ థామస్ బాబును,ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన డాక్టర్లను కోలా ప్రసాద్ దుశ్శాలవాలతో, పూలహారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ప్రశాంత్, దేవరాజు కృప రాజు, డేవిడ్ రాజు, క్రాంతి రాజు ,ఆనంద్ పాల్, రెడ్డి ప్రకాష్ రాజు, శీనన్న, ప్రభాకర్, చిన్నప్ప, కోలా యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల ఏఐటీయూసీ ఏరియా నూతన కమిటీ ఎన్నిక






**వేంపల్లె - సూర్య వాస్తవం:** స్థానిక వేంపల్లి ఎస్టీయు ఆఫీసులో ఏఐటియుసి సమావేశంలో, ఏఐటీయూసీ పులివెందుల నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక కావడం జరిగింది. ముఖ్య అతిథిగా ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐటియుసి నూతనంగా ఏరియా కమిటీ ఎన్నుకున్నట్లు విలేకరులతో అన్నారు. ఈ నూతన కమిటీలో 41 మంది ఏరియా సమితి సభ్యులు 14 మంది ఏరియా కార్యవర్గ సభ్యులు వీరితోపాటు ఏఐటీయూసీ నూతన ఏరియా కార్యదర్శిగా బ్రహ్మం, కొత్తకాల్వ ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులుగా బల్లారపు రామాంజనేయులు, ఏఐటియుసి ఏరియా కోశాధికారిగా మల్లేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అని అన్నారు.

## ఐఈఆర్పీఎస్‌కి పూర్తిస్థాయి పే స్కేల్ అమలు పరచాలి

**- నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** 2001 నుండి సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసి పూర్తి స్థాయి పే స్కేల్స్ అమలు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొందూరు శ్రీనివాసరాజు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏర్పాటుచేసిన ప్రత్యేక ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్ట్ ఉత్తర్వులను అనుసరించి గత 25 సంవత్సరాలుగా ప్రత్యేక ఉపాధ్యా యులుగా పనిచేయుచున్న వీరిని రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. జీవో నెంబర్ 13 ప్రకారం ఇప్పటికే మంజూరైన సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులలో వీరిని నియమించి పూర్తిస్థాయి వేతనాలు చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేయాలని ఆయన కోరారు. సుదీర్ఘకాలంగా రాష్ట్రంలో మానసిక వికలాంగులకు సేవ లభిస్తున్న వీరిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి వీరిని, వారి కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, రామానుజన్ రెడ్డి, జమాలులా ఖాన్, కళాధర్ ,త్రిలోక్ రామమోహన్, వెంకటేష్, హరి నాయక్, నాగేంద్ర నాయక్, ధన తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురు నియామకాలు

**- చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా నోమేష్ రెడ్డి**

**- కడప జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులుగా తుమ్మల శివ శంకర్ రెడ్డి**

**- పోరుమామిళ్ల మండల అధ్యక్షులుగా వి.జగన్ మోహన్ రెడ్డి**

**- ప్యాపీలి మండల రైతు విభాగం అధ్యక్షులుగా అంకిరెడ్డి జగదీశ్వర రెడ్డి నియామకం**

**- ఏబిఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి**



**ప్యాపిలి - సూర్య వాస్తవం :** అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురిని నియమించినట్లు అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులునారుపల్లె జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అఖిల భారత రెడ్డి సంఘంలో పలువురు నియమించి వారికి నియామక పత్రాలు అందజేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లా అధ్యక్షులు గా తూర్పు నోమేస్ రెడ్డి, వైయస్సార్ కడప జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులుగా తుమ్మల శివశంకర్ రెడ్డి, వైయస్సార్ జిల్లా పోరుమామిళ్ల మండల అధ్యక్షులుగా వెన్నపూస జగన్మోహన్ రెడ్డి , నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రైతు విభాగం అధ్యక్షులుగా జగదీశ్వరరెడ్డి లను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ వివిధ పదవులు పొందిన వారికి అఖిల భారత రెడ్డి సంఘము తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు అని తెలిపారు. మీ నాయకత్వంలో రెడ్డి యువత, మహిళాలు ఐక్యంగా ముందుకు సాగి, సమాజాభివృద్ధి దిశగా మరింత కృషి చేస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నానని అన్నారు.

**రెడ్డి సమాజం ఐక్యమే మన బలం**

మీ సేవా ప్రయాణం విజయవంతం కావాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాము అని తెలిపారు. పదవులు పొందిన వారు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో పదవులు ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురుకూటి రామభూపాల్ రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పొన్నపురెడ్డి శకుంతల రెడ్డి, ఇతర రాష్ట్ర, జిల్లాల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

## రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలోని గాంధీసర్కిల్‌లో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సిఐ రామారావు ఆదేశాల మే రకు ఎస్సై అమీర్ ఖాన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై అమీర్ ఖా న్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదా రులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాల ని,కార్లలో ప్రయాణించే వారు తప్ప నిసరిగా సీటు బెల్టు ధరించాలని అ లాగే ఆటో డ్రైవర్లు అతివేగం,ఓవర్ లోడ్ ఆటోలో ఎటువంటి డెక్కులు పెట్టారాదని మద్యం సేవించి వాహ నం నడపరాదని,హెచ్చరించారు,అ లాగే పాదచారులు రోడ్డు దాటడాని కి జీబ్రా క్రాసింగ్,ఫుటోవర్ బ్రిడ్జిలను (ఎఫ్ఎబీఎస్) మాత్రమే ఉపయోగించాలని డ్రైవింగ్ చేసే సమయంలో మొబైల్ ఫోన్ వాడకాన్ని పూర్తి గా నివారించాలి అని,రోడ్డు భద్రత నియమాలను పాటించాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు స్థానిక ప్రజలు గుత్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

- ఎంపీపీ వీర నారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్
- కన్నుల పండుగగా పాఠశాల దినోత్సవం వేడుకలు




**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు సోమవారం నాడు పాఠశాల దినోత్సవం వేడుకలను ప్రధానోపాధ్యాయులు ప్రతాపరెడ్డి అధ్యాపక బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు స్కౌట్ విద్యార్థుల చేత అతిధులకు స్వాగతం పలకగా సభ స్థలానికి చేరుకొని గౌరవ వందనాన్ని స్వీకరించారు అనంతరం ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేయగా విశిష్ట అతిథులుగా పూర్వపు విద్యార్థి శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్ తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షుడు శీలం నరసింహ గౌడ్ హాజరయ్యారు ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఎంపీపీ వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత కష్టపడి ఇష్టంతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో స్థిరపడడానికి సంకల్పాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఇక్కడ ఉన్నటువంటి ఉపాధ్యాయులు చెప్పేటువంటి అంశాలను తూచా తప్పకుండా పాటిస్తూ శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బ్రహ్మంగారి మఠం ప్రాంతం మహా పుణ్యక్షేత్రమని ఈ పుణ్యక్షేత్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి విద్యను అభ్యసిస్తున్నారంటే అది మీ పూర్వజన్మ సుకృతం అని ఆయన తెలిపారు అంతకుముందు అధ్యాపకులు వారికి జిల్లా పరిషత్ హై స్కూల్ ను శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జిల్లా పరిషత్ హైస్కూల్ గా పేరును మార్చే విధంగా ఎంపీపీ వీరనారాయణరెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేయగా ఆ విజ్ఞప్తి మేరకు ఆయన స్పందించి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో మాట్లాడి రానున్న జడ్పీ సమావేశాల్లో ఈ ప్రతిపాదనను ప్రస్తావించి ఆ పేరును పెట్టే విధంగా తీర్మానం చేయిస్తానని హామీ ఇచ్చారు అనంతరం శ్రీవీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మూడు లక్షలతో విద్యను అభ్యసించాలని ఒకటి మీరు ఆటోగ్రాఫ్ తీసుకోవడం కాదు ఆటోగ్రాఫ్ ఇచ్చే స్థాయికి ఎదగాలని రెండవది మీకు మీ తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి పెట్టే స్థాయిలో నిలవాలని మూడవది మీ స్కూలుకు మీరే ఉన్నత స్థాయిలో ముఖ్య అతిథిగా వచ్చే రోజు రావాలని సంకల్పం పెట్టుకొని ప్రతి విద్యార్థి గురువుల చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటూ ఉన్నత లక్ష్యాలను నెరవేర్చుకునే విధంగా తయారు కావాలని రానున్నది పరీక్ష కాలం గనుక శ్రద్ధతో విద్యను అభ్యసించి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన తెలిపారు అనంతరం పాఠశాల విద్యార్థులతో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు నారాయణస్వామి వీరనారాయణ ప్రభాకర్ రావు సత్యబాబు అధ్యాపకు బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## క్వాంటం క్యాలెండర్--2026, 'క్వాంటివ్ న్యూస్‌లెటర్' ఆవిష్కరణ



**వేంపల్లె - సూర్య వాస్తవం:** మంగళవారం ఇడుపులపాయలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ప్రాంగ ణంలో క్వాంటం ఇనిషియేటివ్లో భాగంగా క్వాంటం ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో రూపొందించిన క్వాంటం క్యాలెండర్--2026, క్వాంటివ్ న్యూస్‌లెటర్‌ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా ముఖ్య అతిథిగా హాజరై, క్యాలెండర్ మరియు న్యూస్?లెటర్?ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల కృషిని అభినందిస్తూ, క్వాంటం సైన్స్, టెక్నాలజీ రంగాలలో ఇలాంటి ప్రయత్నాలు విద్యార్థులకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి డా.పెనుగొండ రవికుమార్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ రమేష్ కైలాస్, క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ కోఆర్డినేటర్ డా. సుధాకర్ రెడ్డి, క్వాంటం టెక్నాలజీ కోఆర్డినేటర్ భాస్కరయ్య, పర్చేస్ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ మదన్, అలాగే క్యాంపస్ మెయింటెనెన్స్ కోఆర్డినేటర్ పవన్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఎస్సై జి శోభ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుముల ఆదేశాల మేరకు శక్తి టీం ఆధ్వర్యంలో అనంతపురం హరిజనవాడలో శక్తి టీం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఫోన్ కాల్ తీయకూడదని ఒకవేళ ఫోన్ కాల్ తీసిన వెంటనే ఓటీపీ ఆధార్ సంబంధిత అంకెలు చెప్పకూడదన్నారు. అంతే కాకుండా గ్రామాలలో వ్యక్తిగత కక్షలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అన్నారు.ప్రతి ఒక్కరు అన్యోన్యంగా కలిసి ఉండాలన్నారు. అలాగే మద్యం సేవించి అల్లర్లు సృష్టించిన వెంటనే కేసు నమోదు చేసి కఠిన శిక్షలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం, విద్యాసాగర్ రెడ్డి పకీరమ్మ ప్రజలు పాల్గొన్నారు.

# పశుపతినాథస్వామి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే కాలవ విన్నపం

- సానుకూలంగా స్పందించిన స్పెషల్ సిఎస్ అజయ్ జైన్



**రాయదుర్గం - సూర్య వాస్తవం:** చారిత్రక ప్రసిద్ధినొందిన లింగాలబండ పశుపతినాథస్వామి ఆలయ అభివృద్ధి, పునరుద్ధరణ పనులను స్థానిక భక్తుల సహకారంతో చేపట్టేందుకు వీలుగా అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర టూరిజం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్‌కు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విన్న వించారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంగళ వారం సాయంత్రం కలుసుకొని ఆలయ అభివృద్ధిపై వినతిపత్రం అంద జేశారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న రాయ దుర్గం నియోజకవర్గంలో శైవ భక్తులు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని పేర్కొన్నారు. శైవ ఆగమ శాస్త్రానుసారం ఈ ఆలయాన్ని పునరుద్ధరించి, దాని పవిత్రతను పునరుజ్జీవింప జేయాలని, సక్రమ ఆరాధనకు అనువుగా మార్చాలని భక్తులు కోరుతున్నారని తెలియజేశారు. ఈ ఆలయం అపారమైన చారిత్రక మరియు ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను కలిగి ఉందని వివరించారు. భారత దేశంలో ఇలాంటి ఆలయాలు చాలా అరుదుగా ఉండగా, ఈ ఆలయాన్ని నేపాల్?లోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన పశుపతినాథ ఆలయంతో పోలుస్తారని తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఒక సందర్భంలో రాయదుర్గం మరియు ఈ ఆలయాన్ని ప్రస్తావించడంతో, ఈ దేవాలయానికి జాతీయ స్థాయిలో ప్రాధాన్యం మరియు గుర్తింపు లభించిందన్నారు. ఈ ఆలయాన్ని మొదట చాళుక్య వంశానికి చెందిన పాలకులు నిర్మించగా, అనంతరం విజయనగర సామ్రాజ్య పాలకులు దీనిని పునరుద్ధరించారని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తు, కాలక్రమేణా పవిత్ర శివలింగం, నందులు దెబ్బతిని, నిత్య పూజలు మరియు అభిషేకాలు సక్రమంగా నిర్వహించడం కష్టంగా మారిందని విన్నవించారు. అమూల్యమైన సాంస్కృతిక మరియు ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రోత్స హించి, స్థానిక ప్రజలకు మేలు చేకూరుతుందని ఇదివరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవి ంచానని తెలియజేశారు. తన విజ్ఞప్తి మేరకు సదరు లేఖపై ముఖ్యమంత్రి కార్యాలయం నుండి పంపిన ఉత్తరాన్ని కూడా ఇందువెంట జతపరచడం జరిగిం దన్నారు. ఈ ఆలయాన్ని రాష్ట్ర పురావస్తు శాఖ పరిధి నుండి డీ-నోటిఫైచేసి స్థానిక భక్తుల సహకారంతో అభివృద్ధి చేసుకునేలా అనుమతులు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తిపై అజయ్ జైన్ సాను కూలంగా స్పందించారు. తప్పకుండా త్వరలోనే అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** మార్చిలో జరగబోవు పబ్లిక్ పరీక్షల్లో పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు సూర్యుడు నాయక్ ప్రధానోపాధ్యాయుడు గంగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దేవళంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫేర్వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు కోలాటాలు,నాటకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది దేవలంపల్లి జెడ్పి ఉన్నత పాఠశాల మండల ఫస్టు వచ్చిందని ఈ ఏడాది కూడా 10వ తరగతిలో మంచి ఫలితాలు సాధించి మండలంలో ఒకటో స్థానంలో నిలవాలని వారు కోరారు.అంతేకాకుండా స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులు ఎంతో ఉల్లాసంగా ఉన్నారని అలాగే విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని వారన్నారు. ప్రతి ఏటా మంచి ఫలితాలతో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పులివెందుల సమస్యలపై మంత్రి కొల్లు రవీంద్రతో బీటెక్ రవి భేటీ

**పులివెందుల - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్రని, పులివెందుల నియోజ కవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ , మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బిటెక్ రవి) మర్యాద పూర్వకంగా కలిశారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన ఈ భేటీలో నియోజకవర్గ అభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల నియోజ కవర్గంలో గనులు, భూగర్భ వనరుల శాఖకు సంబంధించి నెలకొన్న వివిధ సమ స్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర మౌలిక సదుపాయాల ఇబ్బందులను కూడా వివరించారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, నియోజకవర్గ ప్రజలకు ఊరట కలిగించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. పులివెందుల నియోజకవర్గ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బిటెక్ రవి ప్రస్తావించిన ప్రతి అంశాన్ని పరిశీలించి, యుద్ధప్రాతిపదికన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## ఈశ్వరి దేవి గృహం వద్ద ఆటో బోల్తా బ్రహ్మంగారి దర్శనానికి వస్తూ ఘటన

**బ్రహ్మంగారిమఠం– సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఈశ్వరి దేవి గృహ సమీపంలోని మలుపు వద్ద సోమవారం రాత్రి రాయచోటి నియోజకవర్గం సుండుపల్లె మండలం అగ్రహారం గ్రామానికి చెందిన వాస్తవ్యులు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టి సమీపంలోని లోయలో పడగా ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్ర గాయాలు పాలయ్యారు వీరందరూ కూడా రాయచోటి ప్రాంతం నుండి ఆటోలో బ్రహ్మంగారి మఠంకి దర్శనార్థం వస్తుండగా ఈశ్వరి దేవి గృహ వద్ద ఆటో అదుపుతప్పి కిందనే ఉన్న లోయ ప్రాంతంలో బోల్తా కొట్టింది సమాచారం అందుకున్న ఎస్సై శివప్రసాద్ తమ సిబ్బంది తో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని 108 వాహనంకు సమాచారం అందించగా పైలెట్ మీనిగ వెంకటేష్ టెక్నీషియన్ రమణ ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారికి ప్రాథమిక చికిత్సను అందించి మెరుగైన వైద్యం కోసం శతగాత్రులను కడప రిమ్స్ తరలించారు.



## అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి గణతంత్ర దినోత్సవ సందర్భంగా గుత్తి మండలంలో అవార్డు గ్రహీ త అధికారులను మంగళ వారం బీజేపీ రాయలసీమ జోన్ కిషన్ మోర్చా ఇన్చార్జ్ తిమ్మారెడ్డి శాలువాతో స త్కరించి సన్మానించారు.ఎస్ఐ సురే ష్ కు, విద్యుత్ శాఖ ఏయ్ మధుసూ దన్ రావుకు, రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ బాబు ఆచారి, వీఆర్వో సురేంద్రకు విడివిడిగా వెళ్లి శాలువాతో సత్కరించి, సన్మానించి అభినందించారు.



Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



# భేదాభిప్రాయాలు లేని సమాజం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కాంగ్రెస్ పార్టీలో చేరిన మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ
- వందలాదిమంది అనుచరులతో మసుమాబి దర్గా నుండి భారీ ర్యాలీ






**అనంతపురం - సూర్య వాస్తవం:** కాంగ్రెస్ పార్టీలో మైనారిటీ నాయకులు మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ మంగళవారం నాడు చేరారు. వందలాదిమంది తన అనుచరులతో అనంతపురం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అయన నాయకుల సమక్షంలో పార్టీలోకి చేరారు. మౌలానా నవాజ్ ఖాద్రి ఆయన అనుచరులకు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు దాదా గాంధీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మౌలానా నవాజ్ బియాబానీ చిష్తిఉల్ ఖాద్రీ మాట్లాడుతూ..... దేశానికి స్వతంత్రం తెచ్చినటువంటి జాతీయ కాంగ్రెస్ పార్టీ కుటుంబంలోకి చేరుతున్నందుకు చాలా గర్వంగా ఉంది స్వాతంత్రం అనంతరం మన దేశ ఆర్థిక పరిస్థితులు చాలా ఘోరంగా ఉండేవి ఆనాడు అభివృద్ధి కూడా అంతంత మాత్రమే ఉండేది స్వతంత్రం వచ్చినప్పుడు మనం చిన్నపాటి గుండు సూదిని కూడా తయారు చేసుకోలేని స్థితి నుంచి ఈరోజు అన్ని రంగాలలో మనం ముందున్నామంటే అన్ని వ్యవస్థలు పటిష్టంగా బలంగా ఉన్నాయంటే దానికి కారణం కాంగ్రెస్ పార్టీ పరిపాలన విధానం మన దేశంలో ఎన్నో కులాలు ఎన్నో మతాలు ఉన్నాయి కానీ అంతా కలిసిమెలిసి ఒకే కుటుంబంలో అన్నదమ్ముల ఉన్నామంటే కాంగ్రెస్ పార్టీ తెచ్చినటువంటి రాజ్యాంగం మరియు చట్టాలు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక దేశ ఆర్థిక పరిస్థితులు చక్కదిద్దడమే కాకుండా ఎంతో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వ్యవస్థలను నిర్మించడం జరిగింది. సామాజికంగా ఆర్థికంగా బలిష్టమైనటువంటి వ్యవస్థను కాంగ్రెస్ పార్టీ జాతికి ఇచ్చింది అందరికీ సమాన హక్కులను ఏర్పాటు చేసింది ఎన్నో త్యాగాలు చేసి అమరులైనట్టు అమరులై దేశానికి స్వతంత్రాన్ని సంపాదించి పెట్టిన మహానుభావులు నెలకొల్పినటువంటి జాతీయ కాంగ్రెస్ పార్టీలోకి నేను నా స్నేహితులు ముఖ్య అనుచరులతో ఒక బలమైన నమ్మకంతో భవిష్యత్ తరంలో భవిష్యత్ తరాలలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే కుల మత భేదాభిప్రాయాలు లేని సమాజం సమసమానత్వం కావాలంటే దేశం అన్ని రంగాలలో ఆర్థికంగా ఎదగాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నజురుల్లా ఖాన్ బషీర్ ఖాన్ అబ్దుల్ రహీం,రియాజ్ , మున్నా శేఖర్ మురళి మౌర్య మౌలానా సులేమాన్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల సమస్యలకు ప్రాధాన్యమిచ్చిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

- విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్



**సూర్య వాస్తవం ప్రతినిధి (విజయవాడ)**
విజయవాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడ శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళ వారం సాయం త్రం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం పలువురు నేతలతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

# టీడీపీ నేతకు నివాళులర్పించిన గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే



**పామిడి- సూర్య వాస్తవం:** పామిడి మండలం జి.కొట్టాల గ్రామ తెదేపా సీనియర్ నేత తిప్పరెడ్డి ఆరోగ్య సమస్యలు కారణంగా అకాల మరణించడం జరిగింది. ఈ సమాచారం తెలుసుకొన్న తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, గుంతకల్లు మాజీ శాసనసభ్యులు ఆర్. జితేంద్ర గౌడ్ మృతుని స్వగ్రామంలోని నివాసానికి చేరుకొని భౌతిక కాయానికి నివాళులర్పించారు. తిప్పరెడ్డి మరణం తెదేపా తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనో ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నానని తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు, గుత్తి,పామిడి మండలాల పలువురు ముఖ్యనేతలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

- "రోడ్డు సేఫ్టీ మిషన్" ప్రారంభించిన ఎస్పీ పి. జగదీష్




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు "రోడ్డు సేఫ్టీ మిషన్" ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపరాదనే అంశాలపై అవగాహన, ర్యాలీలు, స్కూల్/కాలేజీల్లో ప్రత్యేక సమావేశాలు, డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై, ముఖ్యంగా ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్?పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...37 వ రోడ్డు భద్రతా మాసోత్స వాలలో భాగంగా ఈ రోడ్డు సేఫ్టీ మిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈరోజు నుండీ 5 రోజుల పాటు జిల్లాలో రోడ్డు సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నాం. జిల్లా పరిధిలోని అన్ని రహదారులపై 34 బ్లాక్ స్పాట్స్ ... 27 యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలు ఉన్నాయి. గత మూడేళ్లలో ప్రమాదాలు చూస్తే 2025లో బాగా తగ్గినప్పటికి చాలా మంది చనిపోయారు, క్షత గాత్రులుగా మిగిలారు. హెల్మెట్ / సీట్ బెల్టు వేసుకోక పోవడం, ఓవర్ స్పీడ్, డ్రంకన్ డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవ్, రాంగ్ పార్కింగ్ , మొబైల్ ఫోన్ డ్రైవింగ్, ప్రమాదాలకు కారణాలుగా గుర్తించడం జరిగింది. ఎక్కువ ప్రమాదాలు మధ్యహ్నం 3 నుండీ మధ్య రాత్రి 12 వరకు జరుగుతున్నాయి. ప్రధానంగా సాయంత్రం 6 గంటల నుండీ రాత్రి 9 గంటలలోపు ఎక్కువుగా జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో మన మందరం మేల్కోవాల్సి ఉంది. రోడ్డు ప్రమాదాలకు అడ్డు కట్టవేయాలి. అందరం చేయి చేయి కలుపుదాం. ప్రజల ప్రాణాలు కాపాడుదాం. ఎవ్వరూ ప్రమాదాలకు గురై రోడ్డున పడకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో ట్రైనీ అధికారి అశ్విని మణిదీప్, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ, ఆర్టీఓ సురేష్ నాయుడు, డిస్కవర్ అనంతపురం అనిల్, ఆర్డీటి రాజశేఖర్ రెడ్డి, సి.ఐ లు విజయ భాస్కర్ గౌడ్, వెంకటేష్ నాయక్, షేక్ జాకీర్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రాజేంద్రనాథ్ యాదవ్, జగదీష్, స్కూళ్లు కళాశాలల యజమానులు, డ్రైవింగ్ స్కూల్స్ నిర్వా హకులు, పెట్రోల్ పంప్ ఓనర్లు, వెహికల్ షోరూంల నిర్వాహకులు, నగరపాలక సంస్థ అధికారులు, ఏపీఎస్ ఆర్టీసి అధికారులు, షాపింగ్ మాల్స్, యూత్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమంలా రోడ్డు భద్రతపై అవగాహన

- జిల్లా వ్యాప్తంగా సమావేశాలు, ర్యాలీలు




**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా జిల్లా పోలీసులు రోడ్డు సేఫ్టీ కార్యక్రమాలను ఉద్యమంలా ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా "రోడ్డు సేఫ్టీ మిషన్"లో భాగంగా పలు రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా రహదారులు, ముఖ్య కూడళ్లలో అవగాహన ర్యాలీలు, ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించారు. అలాగే పాంప్లెట్ పంపిణీ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగం, నాలుగు చక్రాల వాహనదారులకు సీట్ బెల్ట్ ప్రాధాన్యతపై వివరించారు. విద్యాసంస్థలు, బస్ స్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలలో ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి ప్రమాదకర అలవాట్ల వల్ల జరిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని ఆయా పోలీసులు తెలిపారు. రోడ్డు సేఫ్టీ మిషన్ ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని పోలీసులు వెల్లడించారు.




# ఎల్ఆర్ఎస్‌కు గడువు పొడిగింపు

- నాయుడుపేట మున్సిపాలిటీలో ఏప్రిల్ 23 వరకు అవకాశం



**నాయుడుపేట - సూర్య వాస్తవం :** నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని అనధికారిక లేఔట్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఎల్ఆర్ఎస్ (లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తుల గడువును ఏప్రిల్ 23 వరకు పొడిగించినట్లు మున్సిపాలిటీ కమిషనర్ షేక్ ఫజులుల్లా తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, అనధికారిక లేఔట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం మూడు నెలల పాటు అదనపు అవకాశం కల్పించిందన్నారు. ప్లాట్? యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మూడు నెలల గడువు అనంతరం అనధికారిక లేఔట్లలో ఉన్న ప్లాట్లకు భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. కావున సంబంధిత ప్లాట్ యజమానులు నిర్ణీత గడువులోపే ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు సమర్పించాలని కమిషనర్ షేక్ ఫజులుల్లా విజ్ఞప్తి చేశారు.

# సిడబ్ల్యూసి సభ్యులు రఘువీర రెడ్డి చేపట్టిన పాద యాత్రను విజయవంతం చేయండి

- డీసీసీ అధ్యక్షులు షానవాజ్



**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం:** దేశంలో మన జాతిపిత మహాత్మా గాంధీ మూలాలను చెరిపే ప్రయత్నం జరుగుతుంది కాబట్టి నేటి యువతకు సమాజానికి మహాత్మా గాంధీ సిద్ధాంతాలు ఆశయాలను తెలియజేయాలనే ఉద్దేశంతో నేటి నుండి 30 వ తేదీ వరకు సిడబ్ల్యుసి సభ్యులు రఘువీర రెడ్డి చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కే ఎస్ షాన్ వాజ్ తెలిపారు. నేటి ఉదయం 9 గంటలకు నీలకంఠాపురం గ్రామం నుండి ప్రారంభమై జనవరి 30వ తేదీ హిందూపురం గాంధీ చౌక్ వరకు కొనసాగుతుందని.. కావున ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్య కర్తలు, మహాత్మా గాంధీ అభిమానులు, లౌకికవాదులందరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం




**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలోని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు, మంగళవారం గుత్తిలోని ఎస్‌బీఐ ప్రధాన శాఖ ఎదుట బ్యాంకు అధికారులు, సిబ్బంది నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజుల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బ్యాంకుల బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ బైపార్టైట్ సెటిల్‌మెంట్ ద్వారా ఆమోదించబడిన ఐదు రోజుల పని విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వరకు మాపోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. బ్యాంకింగ్ రంగం ప్రజలకు, మానవ సేవలకు ఎంత ముఖ్యమోవివరించి, ఉద్యోగుల హక్కులపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడమే తమ లక్ష్యమని తెలిపారు.

- సామాన్యుడిలా చివరి వరుసలో కూర్చున్న సీఎం చంద్రబాబు
- రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు

# కార్యకర్తే అధినేత..






**సూర్య వాస్తవం ప్రతినిధి - మంగళగిరి (ఎన్టీఆర్ భవన్)**
తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో ఉక్కుకవచంలా తీర్చిదిద్దే లక్ష్యంతో మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో 'పార్లమెంట్ కమిటీల వర్క్ షాప్' ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం లో ముఖ్యమంత్రి మరియు పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

**సామాన్య కార్యకర్తలా ముఖ్యమంత్రి నిరాడంబరత**
ఈ వర్క్‌షాప్‌లో ఒక అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. రాష్ట్ర ముఖ్య మంత్రి హోదాలో ఉండి కూడా, చంద్రబాబు నాయుడు ప్రోటోకాల్ ఆడంబరాలకు పోకుండా, ఒక సాధారణ కార్యకర్తలా సమావేశ మందిరంలోని చివరి వరుసలో కూర్చుని శిక్షణా తరగతుల్లో పాల్గొన్నారు." కార్యకర్తే అధినేత" అనే పార్టీ నినాదాన్ని ఆయన స్వయంగా ఆచరించి చూపడం అక్కడ ఉన్న నాయకుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

**వర్క్ షాప్ ముఖ్యాంశాలు:**
**పాల్గొన్న ప్రతినిధులు:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 పార్లమెంట్ కమిటీల నుండి మొత్తం 1050 మంది ప్రతినిధులు ఈ వర్క్ షాప్ కు హాజరయ్యారు. (ఒక్కో పార్లమెంట్ కమిటీ నుంచి 42 మంది సభ్యులు).
**శిక్షణ అంశాలు:** నాలుగున్నర దశాబ్దాల పార్టీ ప్రస్థానం,



పార్టీ ఐడియాలజీ, క్యాడర్ మేనేజ్మెంట్, మరియు కార్యకర్తలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతపై కూలంకషంగా చర్చించారు.
**ప్రభుత్వ విజన్:** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం రూపొందించిన 'విజన్ ప్లాన్స్' పై శిక్షణ ఇచ్చారు.
**నాయకులకు చంద్రబాబు దిశానిర్దేశం:**
ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ విజయాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. ఈ వర్క్ షాప్‌లో రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు మరియు ఇతర పార్లమెంట్ కమిటీల ముఖ్య నేతలు, సభ్యులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ మేధోమథన కార్యక్రమం పార్టీ బలోపేతానికి పునాదిగా నిలిచింది.

# సైబర్ బెదిరింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డిజిటల్ అరెస్ట్ అనేది డబ్బు దోపిడీకి ఒక స్కాం
- పులివెందుల అర్బన్ సిఐ సీతారామరెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం:** రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని పులివెందుల అర్బన్ సిఐ సీతారామరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక బిఎస్ఎన్ఎల్ సర్కిల్ వద్ద డిజిటల్ అరెస్టు అనేది డబ్బు దోపిడీకి ఒక స్కామ్ అని సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అరెస్టు, కేవైసీ, ఓటీపీ నెట్‌బ్యాంకింగ్ ఫ్రాడ్, ఇనట్వెస్టమెంట్ ఫ్రాడ్‌స్కామ్, లాటరీ స్కామ్, క్రెడిట్ అండ్ డెబిట్ కార్డ్ స్కామ్, ఫేక్ యాప్స్, లోన్ స్కామ్స్, వర్క్ ఫ్రం హోమ్ స్కామ్, జాబ్ స్కామ్స్, యూపీఐ స్కామ్స్ వంటి సైబర్ మోసాల్లో యువత చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటీపీ, ఆధార్, పాన్ లేదా బ్యాంకు వివరాలు ఫోన్ చేసిన అపరిచితులకు వెల్లడించరాదని సూచించారు. వ్యక్తిగత సమాచారం లేదా డబ్బులు, అనధికార కాల్స్‌కు స్పందించకూడదన్నారు. పోలీసు, సీబీఐ, ఈడీ వంటి ప్రభుత్వ సంస్థలు వీడియో లేదా వాయిస్ కాల్స్ ద్వారా మీపై ఎటువంటి దర్యాప్తు చేయవన్నారు. సున్నితమైన లావాదేవీల కోసం వైఫైని ఉపయోగించుకోవాలని కోరారు. మోసగాళ్ళ బారిన పడ్డ వాళ్లు వెంటనే పోలీసులు ఆశ్రయించాలని పలు విషయాలను సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# రంగనాథ స్వామి బ్రహ్మోత్సవ వేడుకలు ప్రారంభం

- భక్తులందరికీ ఆహ్వానం పలికిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి దేవస్థానాల చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, కమిటీ సభ్యులు





**పులివెందుల - సూర్య వాస్తవం:** మధ్యరంగంగా కొనియాడ బడుతున్న పులివెందులలో ఫిబ్రవరి 1 నుండి శ్రీరంగనాధుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం గానున్నాయని కావున ప్రజలందరూ ఈ కార్యక్రమాలలో పాల్గొని శ్రీరంగనాధుని అనుగ్రహాన్ని అందు కోవాలని శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి దేవస్థానాల చైర్మన్ చింతకుంట సుధీకర్ రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు మరియు ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమాలలో శ్రీ రంగనాథుడు వివిధ విశేష పూజల అనంతరం వివిధ వాహనాలలో గ్రామోత్సవం నిర్వహించబడునని అదేవిధంగా శ్రీ రంగనాథుని కాంప్లెక్స్ నందు ప్రతిరోజు ఆధ్యాత్మిక ఆలోచనలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని కావున ప్రజలు పై కార్య క్రమా లలో పాల్గొని కార్యక్రమం విజయవంతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా 7వ ఎలక్ట్రిషన్ డే

**రాయచోటి - సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ అస్లం ఆధ్వర్యంలో మన రాయచోటి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులందరూ కలిసి మంగళవారం పట్టణంలోని కార్యాలయం వద్ద జెండా ఎగర వేసి 7వ ఎలక్ట్రిషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అస్లాం మాట్లాడుతూ... జనవరి 27, 1880 సంవత్సరంలో థామస్ అల్వా ఎడిసన్ అను శాస్త్రవేత్త బల్బును కనుగొన్నాడు కాబట్టి మన మందరం రాష్ట్ర వాప్తంగా ఎలక్ట్రిషన్ ఓర్తిలో కొనసాగుతున్నామని కాబట్టి ఈ దినాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిషన్ డే గా జరుపు కుంటు న్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి షాజహాన్, కోశాధికారి ఆఫీస్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, శివకుమార్, చిన్న మండెం ఇంచార్జ్ రెడ్డయ్య, నూలివీడు ఇన్చార్జ్ ఖాదర్ వలీ, లక్కిరెడ్డిపల్లి రామ్మోహన, పెద్ద రెడ్డయ్య, రెడ్డయ్య, జానీ, రెడ్డి గణేష్, ఫక్రుద్దీన్, మహబూబ్ బాషా, ఓబుల్ రెడ్డి,జాఫర్, రమేష్, అంజి, దర్బార్, ఆబిద్ అలీ ఖాన్, ఆసిఫ్, నాదర్ బేగ్, కరీం, అబ్బాస్, గఫార్ వలి, తదితరులు పాల్గొన్నారు.



# వెంకటాపురం రచ్చబండలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి





**డోన్ -సూర్య వాస్తవం:** డోన్ మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో డోన్ నియోజకవర్గ శాస నసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొని గ్రామ ప్రజలతో ముఖాముఖీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మమేకమై, వారి సమస్యలు, అవస రాలు, అభివృద్ధికి సంబంధించిన సూచనలను శ్రద్ధగా విన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం అనేక కార్య క్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామం మౌలిక సదుపాయాలతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. వెంకటాపురం గ్రామంలో రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాల మెరుగుదల, పాఠశాలలు, ఇతర విద్యాసంస్థల అభివృద్ధి అంశాలపై గ్రామస్తులతో సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువతతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలు, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు ప్రస్తావించిన సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవిష్యత్తులో కూడా ప్రజలతో నిత్యం సంపర్కంలో ఉండి గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

# మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నేతలు

- శాఖాపరమైన విధుల నిర్వహణలో నిమగ్నమైన మంత్రి మండిపల్లి

**సూర్య వాస్తవం ప్రతినిధి (మంగళగిరి):** సచివాలయం ఛాంబర్‌లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడ శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని పలువురు నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రి శాఖాపరమైన పలు అంశాలపై వారితో చర్చించి, విధులలో నిమగ్నమైనారు.



# సింహ, ముత్యపు పందిరి వాహనాలపై ఊరేగిన కళ్యాణ వెంకటరమనుడు



**పులివెందుల - సూర్య వాస్తవం:**
పులివెందుల పట్టణ పరిధిలో శ్రీ పద్మావతి సమేత కళ్యాణ వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్స వాలలో భాగంగా ఉదయం సింహవాహనం, సాయంకాలం ముత్యపు పందిరి వాహనంపై కళ్యాణ వెంకటరమణ ని బ్రహ్మోత్సవం కొన సాగింది. శ్రీ పద్మావతి సమేత వెంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మో త్సవాలలో భాగంగా ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు, ఉభయదారుల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, నివేదన, హారతి అనంతరం పులివెందుల పురవీధులలో ఉదయం సింహ వాహనం మరియు సాయంకాలం ముత్యపు పందిరి వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం కొనసాగగా గోవింద నామస్మరణతో ప్రజలు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ వార్షిక బ్రహ్మోత్సవాలలో స్వామివారికి విశేష పూజలు అనంతరం వివిధ వాహనాలలో పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించబడునని అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవం మరియు అన్నదాన కార్యక్రమాలు ఆలయ కమిటీ, సబ్ కమిటీ ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించబడునని కావున భక్తులందరూ పై కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని అభ్యర్థించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )